కోతి

★

శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ

౧

రైలు యింకా రాలేదు. ఆకాశం ముసురేసేట్లుగా వున్నది. రివ్వుమని గాలి వుండి వుండి వీస్తూంటే స్టేషనులోని చెట్లన్నీ దేన్నో చూసి జడుసుకుంటున్నట్లుగా కంపించి 'జుయ్' మంటే 'జుయ్' మని గోలచేశాయి.

దుమ్ము రెండు మూడు నిలువుల యెత్తున లేచి సుళ్లుగా తిరుగుతోంది.

చినుకు యింకా భూమ్మీద పడలేదు. పడకుండానే రైలు వచ్చి ప్లాటుఫారంమీద నిల్చుంది.

స్టేషనులోకి త్రోసుకుంటూ వచ్చిన శాస్త్రి, కొంచెం చిరాగ్గా ముఖాన విసురుతూన్నట్లున్న దుమ్ముకు చేయి అడ్డుగా పెట్టి, అప్పటికప్పుడు ఏర్పడ్డ ఆ తొడత్రొక్కిడిలో పరుగెత్తుతూ, ఇటూ-అటూ తిరిగి మొత్తానికి ఆడవాళ్ళ పెట్లన్నీ గాలించేశాడు.

తనకు కావలసిన మనిషి రాలేదు.

బెల్లం చుట్టూ చీమలు ముసిరినట్లుగా ప్రయాణీకులు రైలును చుట్టుముట్టి సామానులు తోచినట్లుగా లోపలకు విసరటంవల్ల నేమి, దిగే జనాభాయొక్క-కుయ్యో మొర్రోలవల్ల నేమీ, యావత్తు ప్లాటుఫారమూ మహాగందరగోళంగా వుంది. ఆ గొడబలో నుంచి యీవలకు వచ్చాక చినుకులు పడుతున్నట్లుగా తోచి మూసిన గొడుగును విప్పాడు శాస్త్రి.

అతను చిన్నప్పట్నుంచీ దేనికోసమో ఎదురు చూస్తున్నట్లుండేవాడు. ఆ ఎదురుచూడ్డం సెలయేటి కెరటాల తరగల పొంగుల్లో పడి పార్లిపోదామనీ కాదు, నీలిరంగు మబ్బుల్లోకి నిండుగా హృదయాన్ని విసిరి రోజాపువ్వుల గుత్తులలోకి ముఖాన్ని దాచుకుందామనీ కాదు, మల్లెలు సన్నజాజుల వాసనలకు మత్తిల్లి ఆదర్శశిఖరాల అంచుల్లో వూహాలకుమాత్రమే అందే అప్సరసతో సుఖిద్దామనీ కాదు—ముంగిసలా కాలం మెలితిరిగిన తన జీవిత సర్పాన్ని రాచి రాచి నేలను వొత్తి కొరుకుతూన్నకొద్దీ—ఒక చల్లని చూపు ఒక తియ్యని మాట వినాలని కోరేది మనస్సు. అంతే! అంతకన్నా పెద్ద ఆశ లేమీ పెట్టుకోలేదు. అతని వివాహం కూడా అంతంతమాత్రంగానే జరిగింది. శిథిలావస్థలో వున్న జీర్ణగేహాన్ని ఏదో నాలుగు తాటిపత్రాలతో కప్పుకుని అందులో సుఖిద్దామనుకున్నాడుగాని అంతస్తులు మిద్దెలు విలాసాల కోసం అతను అర్రులు చాచలేదని మొదటే చెప్పాలి. డబ్బుకోసం పెళ్ళిచేసుకోవటం సుతరామూ శాస్త్రికి అప్పట్లో యిష్టంలేదు. పిల్ల నచ్చటం, మనస్సు కలిసిందా లేదా—యివి అన్నీ వున్నవాళ్లకు గాని తనకేమిటి అనిపించింది. తను విరహవ్యథలు అభినయిస్తూ యింట్లో కూర్చుంటే తనమీద పంచప్రాణాలు పెట్టుకున్న తల్లిదండ్రు లేమికాను? అందుచేతే ఎవరో ఒకత్తి ఆడది—అని చేసేసుకున్నాడు సరస్వతిని. అనుకున్న కండిషను ప్రకారం డబ్బుయిచ్చి చదువు చెప్పించాడు మామగారు. సరస్వతి కాపురానికి వచ్చాక క్రొత్తలో కొంత పెట్టుబడి కూడా తనేమీ కోరకుండానే సర్దుబాటు చేయటం జరిగింది.

ఇప్పుడు శాస్త్రి సంపాదనాపరుడు కాగానే సరస్వతి కంఠాన్ని పొడిగించి—ఆ యావత్తు అర్జనా నిజంగా అనుభవించవలసిన హక్కు తనది గాని అంతర బొంతరవాళ్ళను తెచ్చి మేపటం సమంజసం కాదని వాదిస్తూ వచ్చేది.

మొదట్లో శాస్త్రి సరస్వతిని చూచినప్పుడల్లా కొద్దిగా గర్వపడేవాడు లోపల్లోపల. ఆమె సుందరటి

లేతచేతులు, రోజారంగు చెక్కిళ్ళు, నవ్వినప్పుడల్లా సొట్టలుపడే బుగ్గలు, మధ్యపాపిటి, వొత్తైన నొక్కునొక్కుల జుట్టు జడతో ఎంతో ఆకర్షణీయంగా వుండేది. తరువాత పిల్లలు వాళ్ళతో ఆఫీసునుంచి రాగానే ఆడుకోవటంలో ఎంతో హాయి సుఖమూ లభించేవి.

ఆ హొంగుల్లో తనకు తెలియకుండానే సరస్వతి సంసారక్రమాన్ని క్రొత్తమార్పులతో సవరణలతో ఎన్నిమాట్లు బిగించాలని ప్రయత్నించినా, అదొక తమాషాగానే చూసీచూడనట్లు వూరుకున్నాడు గాని, ఆమెలో అవ్యక్తభావనారూపమై నెలకొన్న అధికారవాంఛా మేఘ మొకనాడు ఝుళిపించి విస్సురుగా యెడాపెడా వర్షిస్తుందనీ, ఆ తుఫానులో ఇక తన ఒక్కగాని ఒక్క చెల్లాయిని రక్షించుకోనన్నా రక్షించుకోలేనని, యిల్లాలు అడ్డుగోడల్ని బాగా పెరుగనిచ్చి 'యిది నా యిల్లు—యిందులోకి మరెవ్వరికీ ప్రవేశార్హత లేదని' నిక్కచ్చిగా కట్టుదిట్టాల్ని చేస్తుందనీ శాస్త్రి బహుశా కలలో కూడా వూహించియుండడు.

వాన కురవసాగింది. కాళ్లీడ్చుకుంటూ పొడుగ్గా కొల్లేటిచేంతాడులావున్న బేడారారోడ్డును దాటివస్తూంటే, ఎక్కడా చెట్టూ చేమా అన్నదిలేక చుట్టూ దిబ్బలేసుకుపోయిన యిసుక మైదానాలలో - వానకు వరదకు, ఎండకు గాలికి అన్నింటికీ తన శరీరాన్ని వప్పగించి కదలక మెదలక అట్లానే పడివున్న ఆ రోడ్డు వొంటరితనానికి కూడా శాస్త్రి జాలిపడసాగాడు.

అతనికి మరొక్క విషయం స్ఫురణకొచ్చింది- తను చిన్నతనాన్ని దాటుతున్నానని క్రమేపీ యింకొక పదేళ్ళకు అంటే నలభై మేరల్లోకి వచ్చేసరికి, యవ్వనంలో దేనికోసమై తపించి లభించక హతాశయులై హత్యలకు ఆత్మహత్యలకు యత్నిస్తుంటారో, సరిగా అటువంటి స్థితే తనకూ వచ్చినా— ఆ వయస్సులో అప్పుడిక స్త్రీకోసం జీవితాన్ని పాడుచేసుకుని పంచప్రాణాల్నీ వొడ్డేటంత తెలివితక్కువ మనిషిగా తను మారనని. తనకిప్పుడు ముప్పై బహుశా వుండొచ్చు. తల అక్కడక్కడ నెరుస్తోంది. ముప్పై యేళ్ళకే పెద్దమనిషా—

శరీరంయొక్క భౌతికమైన పెరుగుదలను గుణించటానికి వయస్సు సాయమవుతుంది. లోపలి మనస్సుయొక్క వయఃపరిమితిని జీవితంలోని దుఃఖాల నుంచి యేర్పడ్డ వొత్తిడి నిర్ణయిస్తుంది. అందువల్లనే కొంతమంది వయస్సు మళ్లినవాళ్లు కూడా చిన్నపిల్లల మాదిరే వుంటారు. ఆ కారణాన్నే రైళ్లలో డిటెక్టివ్ నవలలు, పిల్లల పత్రికలు చదివే పెద్దవాళ్ళు తారసపడ్తూంటారు. అట్టే ఆశ్చర్యపడనవసరం లేదు వాళ్ళనుగూర్చి.

శాస్త్రికి అనుభవమైతే వుందికాని పది పదిహేడేండ్ల వయస్సుకు ముందు, బచ్చాలు, చెడుగుడు గూటీబిళ్ళ బంతి ఆటలు ఆడుకొంటూ తిరిగి పెరగవలసిన వయస్సులో సుఖదుఃఖాల్ని తూచుకుందుకు వలసినంతగా శక్తి లేదు. తను లేని కుటుంబానికి చెందానని, పేదతనంవలన జీతం కట్టుకోలేకుండా

వున్నానని తలకో పావలా అర్ధా సాయం చెయ్యవలసినదిగా పెద్దమనుష్యుల యెదుట నిలబడి అర్థించాల్సి వచ్చేది. అట్లా వినయవిధేయతలుగల్గిన ఒక బీదకుర్రవాడుగా వుంటూ పరిమితావకాశాల సుడిగుండంలో పడ్తూ లేస్తూ మసిలి పెరిగిన వ్యక్తికి స్వేచ్ఛ నియమబద్ధమైన జీవితం, నన్ను ముట్టుగోకు నా మాలగాకి అనేట్లుగా తన వర్గంలో కూడా జీవించవల్సివస్తే ఎట్లాగుంటుంది? అంచేతే ఆ సంసారం సుఖజీవనసారం కాలేదు.

'ఆ చెల్లెలు—అదే నాకు మిగిలివుంది.' అనేవాడు అర్థం చేసుకోమన్నట్లు.

ఇంకా ఒకప్పుడు ప్రాణం విసిగి కసిరేవాడు సరస్వతిని.

'నువ్వు ఏడ్చి పెడబొబ్బలు పెట్టనక్కర్లేదు. ఇక్కడ వుండటం యీ చాకిరీ చెయ్యటం నీవల్ల కాకపోయినా, నీ కిష్టం లేకపోయినా నిక్షేపంలా మీయింటికి నువ్వు వెళ్తానన్నా నిన్నేమీ అనేవాణ్ని కాను.'

ఈ ముక్కలు విన్నప్పుడల్లా సరస్వతి ముఖం అగ్నిగోళమయేది.

అట్లా చివరకు రెండు సమానశక్తుల తీవ్రమైన విజృంభణవాగ్వాద పోరాటాలకు ఆ యిల్లు నిలయమై కూర్చుంది.

సరస్వతి యిలాగనేది.

'నేను మీ ఒక్కగాని ఒక్క చెల్లెలుకు రాకూడని జబ్బేదో ఆమెకే వచ్చింది. వస్తే చేయనన్నానా? అంటువ్యాధికదా క్షయ. మన ఇంట్లోనూ చంటిపిల్లలు. ఎందుకిక్కడకని ఆ వుద్దేశ్యంతో అన్నాను గాని, మీకు లేని అభిమానం నాకుంటే మట్టుకు యీ కొంపమీద-అది ఎందుకు చెల్లుతుంది? నీరసస్థురాలినని చేసుకోలేనని మీకేమన్నా వున్నది గనుకనా? లోకం దీనికి పాడా పాబ్బా గిట్టదని అనుకుంటుంది. దానికితగ్గట్టే మీకూ నన్ను అవమానించాలనే వుంది వుండబట్టే పుట్టింటికి పొమ్మని అంత తేలిగ్గా అనగలిగారు. నాకు మట్టుకు ఏమి ఓడిసింది యిక్కడ—కానీండి? చెట్టుకు కాయలు బరువా? నా వాళ్ళకు నేను బరువు కావటానికి వాళ్ళ కేమీ తక్కువ లేదు.'

శాస్త్రి అప్పటికీ గొంతు చించుకుంటూ నాలుగూళ్ళకు వినిపించేలా—'వెళ్ళు వెళ్ళు ఎవరుద్ధరిస్తా రిక్కడ.' అన్నాడు చిరాగ్గా.

అన్నట్లుగానే ప్రయాణమై వెళ్తూ 'అంతా నన్ను వొంటెత్తు మనిషని చిన్నప్పట్నుంచీ వెక్కిరిస్తూ వచ్చారు. ఆ మాటే మీకూ రూఢి చెయ్యాలని వుంది. నేను ఏమైనా సహిస్తాను కాని అవమానాన్ని మాత్రం సహించను.' అంది సరస్వతి.

శాస్త్రి వూరుకోలేదు.

'నీ మాట చెల్లకపోతే నీకేదో అవమానం జరిగినట్లే వుంటుంది. నా సహజధర్మాలన్నింటినీ నీకోసం వదిలేసుకుని జోగినై గంగిగోవులా డూడూ డూడూ బసవన్నా అంటే ఎగిరి గంతెయ్యకపోతే యింత రభసా చేసేదానివేనా?'

సరస్వతి తన సుందరముఖారవిందాన్ని మాటిమాటికి వొత్తుకుంటూ—'మీ ధర్మాలన్నీ మీరు సక్రమంగానే నిర్వర్తించుకోండి. ఐతే ఆ ధర్మపరిపాలనలో కాస్త నాకుకూడా మిగిల్చి న్యాయం చెయ్యండి. ఎంతచెడ్డా మీ కంటె కొంత దుష్టస్వభావురాలిలా ఉన్నా నా మెళ్లోనూ ఒక పెద్ద పెయ్య కట్టుత్రాడు మంగళసూత్ర మనే పేరిట బిగించారు. అదైనా పూరిఖీమాత్రం కాదు......'

శాస్త్రి కాలుకాలిన పిల్లి లాగున నిప్పుత్రొక్కిన కోతిలా అయి—'మరి అందుకా నన్ను కొనుక్కున్నట్లు మాట్లాడుతున్నది. విను—మీ యింట్లో అస్తమానూ పూజలు నోములు వ్రతాలని ఎంతో హడావిడి చేస్తూంటారే ఇంత కోపాగ్ని చల్లార్చుకోలేనిదానివి—ఎందుకు? ఎట్లా సాగించాలనొచ్చావు జీవితం? నీ మాట చెల్లకపోతే ప్రపంచమంతా తలక్రిందులు కావలసిందేనా—ఛో-ఛో—నా కక్కర్లేదు.' అనేసి చరచరా యింట్లోంచి చెప్పులు వేసుకుని నడిచాడు బయటికి.

శాస్త్రిది క్షణికమైన కోపమని తెలిసీ కూడా అభిమానంకొద్దీ ఆగకుండా పిల్లల్ని తీసుకుని పుట్టింటికి ప్రయాణమై ఆ రోజే వెళ్ళిపోయింది ఆ మహాయిల్లాలు.

చెల్లాయి వచ్చాక—రాజుకున్న అగ్గి ఆరిందనుకుని ఫలానా బండికి వస్తాను పంపమని బావమరదికి

కబురు చేశాడు. మంత్రాలకు చింతకాయలు రాల్తాయా? ఆశకొద్దీ స్టేషనుకు వచ్చాడు. సరస్వతి రాలేదు. కాని రైలు వచ్చింది.

౨

జీవించటం, జీవితము—అందులో సుఖపడ్డం వేరుగా వుంటుంది. కష్టసుఖాలను పునరాలోచన చేసుకుంటూ నడుస్తున్న శాస్త్రికి అప్పుడే నెత్తిమీద ఏదో బరువుగా కదిలినట్లయింది. ఆలోచనల బరువేమీ కాదు.

పిల్లలు విరగబాటుగా నవ్వుతున్నారు. కొంత మంది చప్పట్లు తరుస్తూ వెంబడించబోతున్నారు.

వాన కురవటం మానిందిగదా అని తీగ నొక్కబోతే, గొడుగు వున్నమాటుగా ఒక్క కుదుపు కుదిపినట్లయి తేలికపడింది. ఏమిటాని చూడబోతే—గొడుగు కామమీదుగా లంఘించిన ఆడకోతి, నేలమీదుగా పరుగెత్తుకుంటూ వెళ్ళి ప్రక్కగోడను ఎక్కి, తీరిగ్గా కూర్చొనబోతోంది.

పిల్లలంతా కోతి కోతి అంటూ రాళ్ళను గోడ మీదకు విసర నారంభించారు. బయట వర్షం ముగిశాక రాళ్ళవర్షం ఆరంభమయిందా అన్నట్లుంది. అది కూడా పండ్లికిలిస్తూ, రోమాలన్నీ నిలబడగా, భయంతో కిచకిచలాడుతూ స్వప్రాణరక్షణకోసం ఆ కొమ్మమీదనుంచి యీ కొమ్మమీదకు, యిక్కడ్నుంచి పెంకులమీదకు ఎగుర్తూ నానా అల్లరి ఆరంభించింది.

అక్కడ్డో పెద్దగుంపు ప్రోగయింది. అందులో అన్ని వయసులవాళ్ళూ వున్నారు. అందులో పిల్లలకు వేట సరదా హెచ్చింది. అదిచేసే అల్లరికి వీళ్లు కూడా వెర్రులెత్తిపోయారు.

శాస్త్రికి తనుగా అడ్డువెళ్ళి ఆ కోతిని కాపాడాలనిపించింది. ఎందుకా కోతిమీదకు రాళ్లు విసురుతారు ఆగండని మాటలతో వారించబోతే, పెద్ద చెప్పొచ్చావు వెళ్ళవయ్యా నీకెందుకన్నట్లు చూశారు అక్కడి పిల్లమూక. శాస్త్రి వూరుకునే మనిషి కాదు. ఒకరిద్దరి చేతుల్లోని బెడ్డముక్కలను లాక్కుని నేల మీద పారేశాడు.

కోతి చూస్తూనే వుంది—శాస్త్రి బెడ్డలు గుప్పిళ్ళలోంచి లాక్కుని నేలమీదకు విసరటం. అంతలోనే పిల్లమూక ఎదురు తిరిగి శాస్త్రిమీదకు బెడ్డలు విసరసాగారు. ఒకటి నుదుటిమీదా, ఒకటి గుండెల మీదా ఒకటి ముక్కుమీదా బలంగా తగిలింది.

శాస్త్రికి వుప్పూ పులుసూ తినే మనిషికి వచ్చేటంత కోపం వచ్చింది. గొడుగు మడిచి కుర్రమూకను తరిమి తరిమి చావగొట్టాడు. ఆ ఘట్టం అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించిన దాని కేమీ తీసిపోదు. కాని చిన్న తేడా వుంది. అక్కడ ఒక కుర్రవాడు అతిరథుల్ని మహారథుల్ని గాభరాలెత్తించాడు. ఇక్కడ ఒక పెద్దవాడు కుర్రవెధవల్ని చెమడా లెక్కతీసి పరుగులెత్తేట్లు చేశాడు.

'చచ్చాంరా బాబో...' అంటూ కాలికొద్దీ దూసుకున్నారు.

అట్లా శాస్త్రి వాళ్ళని తరుముతూంటే పరుగు పరుగున వెనకనుంచి వెంబడిస్తూ వచ్చిన కోతి అమాంతం కండ పలికివచ్చేలా అతడి పిక్క పట్టేసుకుంది.

శాస్త్రి పెద్ద కేక పెట్టి, అమాంతం ఆ కోతి పీకను రెండు అరచేతుల్లోకి తీసుకుని, నలిపి చంపేద్దామన్నంత వెర్రికోపంతో పైకెత్తాడు. అంతే—అది తన పొడుగాటి సన్నటి చేతుల్తో కళ్ళు తుడుచుకోసాగింది. అది చూసే చూపులు 'నన్నెందుకు చంపుతావు—' అని జాలిగా అడుగుతున్నట్లున్నై.

శాస్త్రి జ్ఞానమున్న మనిషితో మాట్లాడినట్లుగా పళ్లు పటపటలాడిస్తూ—'యింతసేపూ నా నెత్తిమీద కెక్కి సవారీలు చేస్తివే? భడవా—ఇప్పుడు నిన్ను కాద్దామని వీళ్లని తరుముతూంటే నన్నే పీకుతావూ? చూడు నిన్నేం చేస్తానో...'

అది అంతకన్నా తమాషాగా రెండు చేతుల్నీ ఎత్తి దండం పెట్టింది.

శాస్త్రి పెద్దగా ఆవులించి 'హాసి – నీ యమ్మ కడుపు బంగారం కానూ—ఎన్ని లయలే–' అంటూ చెవిమీద గిల్లాడు.

దాన్ని ఎత్తుకుని వస్తూంటే యింటి కొచ్చే దారిలో, రెండుమార్లు అతని అరచేతులవరకూ జారి, గిల్లి తప్పించుకోవాలని చూసింది. శాస్త్రి దాన్ని

యింకా హృదయానికి దగ్గరగా తీసుకుంటూ యిలా గన్నాడు — 'చేసుకున్న ప్రేయసి చెప్పినా వినకుండా లేచిపోయింది. నువ్వు కూడా అలాగే చేస్తావా—' ఈ ముక్కలు అన్నాక కోతి మెడలోని వొంటి మువ్వ శుభసూచనగా ఘల్లుమంది. శాస్త్రి బిగ్గరగా నవ్వాడు

అతనికి ఆకలి వేసినట్లుగా అనిపించి కోతికేసి చూశాడు. అది బద్ధకంగా ఆవులించింది.

'సరే పద—నీకిక్కడ విందు. రేపు యింటి దగ్గర నీకు పెళ్ళికూతురి ముస్తాబు-సరేనా, అంటూనే శాస్త్రి మర్కట సమేతుడై హోటలు ప్రవేశించాడు. ముప్పావుగా బిళ్ళయేలా యిద్దరూ తినుబండారాలమీద కలియబడ్డారు. కొంతవరకూ మెచ్చికనట్లే మర్కటసుందరి బల్లమీద యిటో చెయ్యి అటో చెయ్యి పడేసి, ముఖ్యంగా సాసరులో శాస్త్రి వూది చల్లార్చిన కాఫీని వుంచగా — అమృతం త్రాగినట్లుగా ఎత్తి గొంతులో పోసుకున్నదై పెదవుల్తో తడి ఆర్చుకుంటూ నాలికంతా బయటపెట్టి తెగశుభ్రంగా నాక్కుంది మూతి.

ఇట్లా అరగంట కాలక్షేపమయేవరకూ, ఇంటి దగ్గర చెల్లాయి సరస్వతి రాక నపేక్షిస్తూ, వక్కశ్రీ కూర్చునివుంటుందన్న విషయం అతనికి గుర్తురాలేదు.

'ఇక పోదాం యింటికి—' అంటూ లేచాడు. దాని దృష్టి తనవైపు లేదు. ఒదులోదులుగా పట్టుకుని పెద్ద పెద్ద అంగల్ని వేస్తూ యీవలకొచ్చి చూశాడు. భూమి అక్కడా అక్కడా గుంటలుపడ్డచోట్ల నీళ్లను నిలవేసుకుని నడవటానికి కష్టమనిపించేలాగుంది రిక్షా కోసం పరధ్యాసగా అటూ యిటూ కాస్త చూశాడు. కోతి అదే సందనుకుని తన్ను దూసుకుని వుడాయించేసింది. శాస్త్రి విస్తుపడి నిల్చుండిపోయాడు. చీకట్లో మరొకవైపునుంచి అరిటిపళ్ళ అత్తాన్ని లంకించుకుని పరుగు పరుగున ఎగురుకుంటూ తన కాళ్ళ మేరకు వచ్చి నిలబడ్డది.

శాస్త్రి ముక్కుమీద వ్రేలుమోపి కఠినంగా —

'తప్పు తప్పు. ఇట్లాటి వెధవ పెంకిపనులుచేస్తే నిన్ను ప్రేమించేది సున్న. పెండ్లికూతుర్ని చేసేది లేదు.'

దుకాణం వదిలిన ఒక ఆడమనిషి లబో దిబో మంటూ వచ్చింది.

'పొరబాటున వదిలేశాను. ఎత్తుకొచ్చేసింది.' అని క్షమార్పణలు చెప్పుకుని వెల యిచ్చేసి తనూ సర్దిపంపాడు.

ఎకాయెకీ యింటికి చేరుకున్నాక చెల్లాయి గుమ్మంలోనే ఆత్రుతగా 'వదిన రాలేదూ—' అంది, వెనక మరో బండి గాని రిక్షావంటిది గాని వస్తూ వుండకపోవటాన్ని చూసి.

'వచ్చింది. పారిపోయిన మీ వదిన్ను పట్టి తెచ్చాను.' అన్నాడు మందహాసంగా.

'ఏది—'

శాస్త్రి కోతిని ఎత్తి చూపించాడు.

'ఇదేమిటి? యిదెక్కడ్నుంచి —'

చెల్లాయి అడుగు వెనక్కు వేసి దారి యిస్తూండగా — క్రొత్తమనిషిని చూడ్డంచేత కోతి కంగారుగా అరిటిపండ్ల అత్తాన్ని దాచుకోబోయింది.

శాస్త్రి 'ఏమిటి? యిప్పుడు దీనికేమి లోటని— అన్నంగా మీ వదినే—శాపవశాన—ఎందుకే అమ్మాయి నవ్వుతావు? అహల్య రాయై పోలేదా? వుద్దాలకుడు చండికకు శాపమివ్వలేదా? నేనేమి తక్కువా—శాపమిచ్చేశాను.'

చెల్లాయికి నవ్వాగింది కాదు. పొట్ట చేత్తో పట్టుకుని—'భలే—అన్నయ్యా! భలే!'

శాస్త్రి చంకనుండి జాగర్తగా నేలకు దింపాడు. చెల్లాయి సోద్యంగా చూస్తూ—'పీకుతుందేమో అన్నయ్యా—' అడుగు వెనక్కు వేసి 'మా ఆసుపత్రిలో. నువ్వు ఒక్కరోజు వున్నావంటే మమ్మల్నందర్ని పొట్టలు చెక్కలయేలా నవ్వించి తీరుతావు. ఇదివరకు డాక్టరు 'నవ్వాలమ్మా—నవ్వితేనే గాని వూపిరితిత్తులు శుభ్రపడవు' అంటూండేవాడు.'

శాస్త్రి చొక్కా విప్పుకుంటూ - 'భయం లేదు. ఎందుకైనా మంచిది. మీ వదిన్ను రెండు రోజులు కట్టిపడెయ్యాలి. ఎక్కడికైనా వుడాయించగలదు.' అని తాడుకోసం వెతికి ప్రాతనులక మంచంనుంచి బాగా రెండు మూడు మూరల త్రాడును జమిలివేసి కోతి మెడలోని పట్టాకు కట్టి తన గదిలోని కిటికీవూచ కా త్రాడును ముడేసి వచ్చాడు.

అతనూ యిటు తిరగ్గానే అది కిటికీలోకి ఎగిరి కూర్చుంది. శాస్త్రి తీరిగ్గా స్నానానికని లేచాడు.

చెల్లాయి జిహ్వాచాపల్యంకొద్దీ అర్టిపండుకోసం అత్తంమీదకు వంగి ఒక కాయ త్రుంపబోయింది. అది ఎట్లా పసిగట్టిందో కిటికీలోంచి మీదకు దుమికి చెంప ఛెళ్ళుమనేలా వాయించేసింది.

భయంతో మంచంవరకూ గెంతి 'రారో అన్నయ్యా. ఈ వదిన పీకుతుందేమో—బాబో...' అంటూ దుప్పటీ లాక్కుని వళ్ళు కప్పుకు మంచం నడుమెక్కి కూర్చుంది.

శాస్త్రి వచ్చి దాని రెండు చెవులూ పుచ్చుకుని మెలేసి 'జాగ్రత్త' అని వురిమాడు.

సరస్వతి అని దానికి నామకరణం చేయటం జరిగాక ఒక వారంరోజులు అహర్నిశలూ తిప్పలు పడి దాని కా పేరు అలవాటుచేయటం జరిగింది.

పెండ్లికూతురుకు జరిగే గౌరవ మర్యాదలన్నీ దానికి జరుగ నారంభించాయి. ఒక యినుపగొలుసు, ఒక పింగాణీ కంచం యిత్తడి గాసూ ప్రత్యేకంగా కొనటం జరిగింది. ఇక్కడకు వచ్చాక మంచి పోషణా అదీ వుందేమో బంతిలా తయారైంది.

శాస్త్రి ఆఫీసుకు వెళ్ళగానే చెల్లాయి కూడా కూడా తిరిగేది. రేగిపళ్ళు వస్తే రేగుపండ్లు, జామి కాయలు ఒకటేమిటి ఏది పడితే అది పుష్కలంగా దానికి పడేసేవారు.

చెల్లాయి వొదినా అన్నా అది వెనుదిరిగి ఎగురు కుంటూ వచ్చి ప్రక్కను కూర్చునేది. దానికి శాస్త్రి రాక కూడా తెలుసును.

'అన్నయ్య వస్తున్నాడేమో చూడు......' అనటం తడవుగా మెట్లన్నీ ఎక్కి అతని గది కిటికీలోకి ఎగిరి కూర్చొని, వచ్చేపోయే గొడుగుల్ని, ముఖాల్ని పరిశీలిస్తూ ఆతృతగా చూసేది.

శాస్త్రి గొడుగు దానికి బాగా గుర్తు. చెల్లాయికి దాని ముఖంలోని సంతోషాన్ని చూస్తూంటే, అతని రాకకు సూచనగా ఆ గొడుగును వీధిమలుపులో చూడ్డంతో దాని కిచకిచల హడావిడికి ఎంతో ఆశ్చర్యం వేసేది.

అతను గడపదాకా రావటంతడవు ఆ గొడుగును లాక్కుని యీడ్చుకుంటూ యిల్లంతా అలంగం తిరిగేది. శాస్త్రి దాన్ని విడిచి ఒక్క నిమిషం కూడా వుండేవాడు కాదు.

స్నానాలగదిలోకి వెళ్ళితే అక్కడకూ, దుస్తులు మార్చుకుంటూంటే ఆ చోటుకీ, వ్రాసుకుం టున్నప్పుడు బల్లమీదా కూర్చునేది.

ప్రత్యేకంగా పువ్వుల సిల్కు జుబ్బాలు ఎన్నో కుట్టించాడు అతను దానికోసం. చెల్లాయి చిన్న చిన్న గళ్ళ పరికిణీలు తయారుచేసి వాటిని తొడిగి అతను వచ్చే సమయానికి ముస్తాబు పూర్తిచేసి శీగ్గా వుంచేది.

తీరిక సమయాల్లో దానికి కొన్ని మనుష్యుల అలవాట్లను నేర్పారు. ఏదన్నా తిన్నాక చేతుల్తో మూతి తుడుచుకుంటుంది. తన వస్తువుల్ని యితరులను వాడనివ్వదు. తనవి కానివి ముట్టుగోదు. పరికిణీ చొక్కా అసహ్యంగా మాపుకోదు.

శాస్త్రి స్నేహితులెవరైనా వస్తే వాళ్ళు వెళ్ళే వరకూ కూడా వుండేది. రాను రాను సాయంత్రాలు బీచికి షికారుకు వెళ్ళటం కూడా అలవాటయింది.

సబ్బుబిళ్ళ తువ్వాలు చేతికిస్తే అది శాస్త్రికి పట్టుకెళ్ళి యిచ్చేది.

ఒకరోజున శనగలు, ఒకరోజున అరిటిపళ్ళు, కారప్పూసలాటి వస్తువుల్ని రోజూ ఎవరో వకరు తెచ్చి బీచ్చిలో తినిపిస్తూండేవారు. శాస్త్రికి కోపం రావటం కూడా దానికి తెలుసు.

పెద్ద పెద్ద కెరటాలు ఎగురుకుంటూ కట్టను ఢీకొంటున్నప్పుడల్లా కుప్పించి కుప్పించి యిసుకలో ఎన్నిరకాల ఆటలో ఆడేది.

శాస్త్రి మిసెస్సు బీచ్చికి రాకపోతే, ఆ రోజు మాత్రం ఎవరిళ్ళకు వాళ్ళు పెందరాళే చేరుకునే వారు.

తరువాత చెలాయిని బెడ్ దొరికినందున ఆసుపత్రిలో చేర్పించటం జరిగింది. ముగ్గురికీ కారియరు వచ్చేది. శాస్త్రి పుష్కలంగా డబ్బు ఖర్చుపెట్ట నారంభించాడు. స్వయానా రెండు చేతులా చాకిరీకి దిగాడు. కారియరు తీసుకెళ్ళటంనుంచి నీళ్లుతోడ్డం యిల్లు సర్దుకోవటంవరకూ పైనే పడింది. ఒక్కొక్క రాయి చొప్పున తీస్తుంటే కొండైనా తరుగుతుంది యిదొక లెక్కా అనుకున్నాడు లోపల.

3

ఒకమారు నిత్యజీవితము, అందులోని యాతనలు తాపత్రయాలనుంచి బైటకు వచ్చిపడ్డాక — ఊపిరి పీల్చుకుందుకు స్వేచ్ఛగా, యేమేమి చేతామని లోపల వుంటుందో, వాట్లన్నిటిని ఆచరణలో పెట్టుకుందుకు సరస్వతికి యిప్పుడు వీలు చిక్కిందనే చెప్పాలి.

ఆలోచనలు పరుగెత్తినంత వేగంగా మనుష్యులు కూడా పరుగెత్తటానికి వీల్లేని గట్టి చిక్కొచ్చి పడింది.

సరస్వతికి చేతిలో డబ్బు లేదు. పది రూపాయలు వుంటేమాత్రం — అది ఏ మూలకూ చాలదు.

మాటమీద మాట అనుకున్న తరువాత 'శాస్త్రి' మాత్రం ఏ సౌకర్యమూ, మంచీ - చెడ్డా అన్నది చూడకుండానే వీధిలో కెళ్ళిపోయాడు.

అట్లాటి మనిషిని ఏమని అడుగుతుంది? ఎంత పరాధీనపు బ్రతుకైనా — తానుగా యిప్పుడు సకిలించి సింహగర్జనలు చేసింది!

వాల్తేరు స్టేషనులో పెట్టి, హోల్డాలు, మరచెంబు, సజ్జబుట్ట రైలులోకి స్టేషనుకూలీ ఎక్కిస్తూన్నప్పుడు 'సరస్వతి' యిలాగనుకున్నది — 'ఆయనకు ఆవచ్చే కోపం ఎల్లానూ వచ్చింది. పోతే పొమ్మని విస్సురుగా అనేవాడు జేబులోంచి పదో పదిహేనో తీసి నా మొహాన ఎందుకు కొట్టలేదూ' అని.

ఆ వెళ్ళటం తిన్నగా ప్రసాదరావు దగ్గరకు — ఒక్కగాని ఒక్క చెల్లెలు తను. చూసి కూడా ఎన్నో రోజులయింది. అక్కడ వుంటే దేనికీ అంతగా యిబ్బంది వుండదు. ఈ తిక్క కుదిరాక అప్పుడు చూసుగోవచ్చును. అంతగా కుదరక, అన్నగారి యింట్లో వుండటం యిష్టంలేకపోతుండీ, ఒక కార్డుముక్క గిలికిపారేస్తే తండ్రి వచ్చి పువ్వుల్లో పెట్టినట్లు తీసికెళ్ళడూ —

సరస్వతి ఆలోచించినట్లు వర్తించినట్లు ప్రాజ్ఞురాలైన స్త్రీ ఎవ్వతీ ఆలోచించదు.

స్వర్గం కానీ, నరకం కానీ, సుఖం కానీ, దుఃఖం కానీ — తనూ, తన యిల్లు తన సంసారమే, తనది కాని — యిది కాదని మరొకచోట, అదికాదని యింకొకచోటకూ, కుప్పిగంతులు వేస్తూ — పరుగెత్తటం వానర వనితలకే చెల్లుతుంది కాని మనుష్యులకు సామాన్య సంసారులకూ కాదు.

అట్లాఅని సరస్వతిని పూర్తిగా కోతినిచేసి వదలటానికి వీల్లేదు. ప్రపంచంలో ఒక రకం స్త్రీలున్నారు. వారికి తమ యిల్లు తమ సంసారము తమ చుట్టూ మనుష్యులు నచ్చారు. అదుగో వాళ్ళ మనషి చేత కట్టెలు తెప్పించుకున్నారు అవి ఎండుకట్టెలు - మరి మీరు వెత్తే పచ్చిమొద్దులు - ముఖాన్ని బట్టి అమ్ముతారు కాబోలు అడివిలో — యిట్లాటి మాటలాడే వ్యక్తులు అస్తమానూ పొరుగుంటి పుల్లకూరే రుచి అనుకుంటారు.

చంటిపిల్లడ్ని తీసుకుని బెజవాడ వచ్చాక అనుకున్నట్లుగానే తన జీవితము ఆరుకాయలు మూడు పువ్వులుగా సాగుతున్నట్లు సరస్వతికి తోచింది.

ప్రసాదరావుకు రెండు చేతులా గట్టి సంపాదన వుంది. తినటానికి వెనుక పదిమంది ఎవ్వరూ లేరు. లింగూ లిటుకూ మంటూ యిద్దరు.

తీగల తంపరలాగ పిల్లలా — లేరు.

అదృష్టవంతులైన బొడ్డున మాణిక్యం పెట్టుకు పుట్టిన స్త్రీ ఎంత సుఖపడ్తుందో — ఆ యింట్లో ఆ వదినగార్ని చూసి తెల్సుకోవచ్చును అనుకుంది సరస్వతి.

ఆవిడకు రవ్వల ముక్కుపుడక - రెండు జతల రవ్వల దుద్దులు వున్నాయి. సాయంత్రం కట్టిన చీర మళ్ళీ వుదయం కట్టదు. ముద్దులేసి ముక్కారు నగలు. కోరిన బట్టా కోరిన నగా తెస్తాడు అన్నయ్య.

సరస్వతి తన వదినగార్ని తల్చుకున్నప్పుడు ఆవిడ వైభోగాన్ని గుణించుకుంటున్నప్పుడు — తన విశాఖపట్నంలోని రెండుగదుల డాబాయిల్లు - ఒకటి క్రింద, ఒకటి పైన — నల్లగా మాసిన కిటికీలు, గలీబులు లేని తలగడాలు, ఒకటి వుంటే ఒకటి లేని సంసారం — యిందుకుపైగా ఏ నాలుగు రూపాయలన్నా జాగ్రత్త చేసుకుందామనే ఆలోచనే లేని తన భర్త అన్నీ జ్ఞాపకానికొచ్చేవి.

చక్కగా వీధినుంచి ఏ వస్తువు కావల్సినా తెచ్చిపడేసేందుకు నవుకరు కుర్రవాడున్నాడు. వాడే చంటిపిల్లడ్నికూడా ఎత్తుకుని ఆడిరచనాగాడు.

రోజూ సాయంకాలం ఏ సినీమాకో పాటకచ్చేరీకో లేడీస్ క్లబ్బుకో పోతూండవచ్చు.

ఈ సౌఖ్యాన్ని కొద్దికొద్దిగా అనుభవిస్తూ మధ్యమధ్యన, చెమటలు కారే ముఖంతో ఎడా పెడా మూటలు సంచులు మోసుకుంటూ యింటికి వచ్చే శాస్త్రి ముఖం, గుర్తుకువచ్చినప్పుడల్లా ఎవరో ఎక్కడ్నుంచో బలంగా విసిరిన రాయి వచ్చి గుండెలకు తగిలితే ఎలా వుంటుందో, అంతకన్నా ఎక్కువే బాధపడాల్సివచ్చేది.

వచ్చిన వారం రోజులకు పిల్లడికి సుస్తీచేసింది. డాక్టరు వచ్చి మందిచ్చాక పదిరోజులకు తగ్గింది. ఎంత పోషణ బాగున్నా వాడు ఎండలకు తట్టుకోలేక నీరసిల్లాడు. వాడికీ తగ్గిందో లేదో రెండు రోజులు తలనొప్పి—ఎల్లాగో అనిపించి తను కూడా పడకెయ్యాలిసొచ్చింది. సరస్వతి కూడా పది పదిహేను లంఘణాలుచేసి పూచికపుల్లయి కూర్చుంది. ప్రసాదరావు అవీ యివీ తెస్తున్నాడు. జాగ్రత్తగానే చూస్తున్నారు. ఇట్లా రెండవనెల కూడా పూర్తికావచ్చింది. కాని యిట్నుంచీ అట్నుంచీ కాకి కూడా కదల్లేదు. జ్వరం తగ్గింది. అస్తమానం డీలయిపోయినట్టుగా అనిపించేది లోలోపల.

లంఘణాలు చేశాక జుట్టు కూడా రాలిపోతూంటే బక్కపలచగా అంటుకుపోయినట్లున్న ముఖాన్ని మాటిమాటికి అద్దంలో చూసుకుంటూ 'ఎంత వికృతంగా వున్నానూ–' అనుకోసాగింది సరస్వతి.

ప్రసాదరావు స్నేహితుల్తో ముందు వరండాలో పెద్దగా నవ్వుతూ పిచ్చాపాటీ ఆడుతున్నాడు.

చంటిపిల్లవాడు మధ్యగదిలో చాపమీద పడుకున్నవాడల్లా వున్నట్టుండి లేచి పెద్దపెట్టున రాగాలాపనకు లంకించుకున్నాడు.

వదిన కాఫీకుంపటి దగ్గర కూర్చుని తెల్లారి లేచాక మూడోమారు అతిథులకోసం కాఫీ సరంజామాలో మునిగి తేలుతున్నట్లుంది.

సరస్వతి అంతక్రితమే తలంటిపోసుకుని దొడ్లో అరుగుమీద కూర్చుని తలకు చిక్కు తీసుకుంటున్నది. పిల్లడి బాకాగొంతుక వినిపించీ కూడా నీరసంతో లేవలేక ఏడవనీ అనుకుని మళ్ళీ దువ్వెన జుట్టులోకి పోనిచ్చి ఒక్కొక్కమారు ఎంత జుట్టు నష్టమవుతున్నదో చూసుకుంటూ దిగులుగా చతికిలబడిపోయింది.

అంతక్రితమే ప్రసాదరావు సిగరెట్లు కిళ్ళీలు తెమ్మని పురమాయించటంవల్ల వెళ్ళిన నౌకరు కుర్రాడు లేడు ఏడిచే పిల్లవాణ్ని ఎత్తుకునేటందుకు.

ఎవరో నౌకరు ఎత్తుకుంటారులే అనుకుని వూరుకుంది సరస్వతి. మధ్యలో కాఫీ కాస్తున్న వదినె 'రావమ్మా—ఆకలికి కాబోలు పిల్లవాడేడుస్తున్నట్లున్నాడు' అని ఒక చిన్న కేక కూడా వేసింది.

సరస్వతికి లేవక తప్పిందికాదు. లేచి అలమార్లో పాలడబ్బా యివతలకు లాగి మూత తెరిచింది. దానినిండా చీమలు. కాస్తో కూస్తో మిగిలివున్న పాల గుండను కాస్తా అనికాజేసినై. నాలిక కర్చుకుంటూ చాపవద్దకు వెళ్ళింది.

పిల్లవాడు పెద్దగుక్క పట్టాడు. ఎత్తుకుని దొడ్లోకి వద్దామనుకుంటోంది.

'ఇంట్లో ఎవరూ లేరా – అవతల పెద్ద మనుష్యులు మాట్లాడుతూంటే—యీ గోల-యిదేమిటి? కాస్త ఎత్తుకోలేరూ ఏడ్చే పిల్లవాణ్ని?' అంటూ వచ్చాడు ప్రసాదరావు.

పాలడబ్బా అయిపోయిందని చెప్పటానికి సరస్వతికి నోరు రాలేదు. చెప్పరాని భయం వేసింది. కాఫీకప్పుల్ని 'ట్రే'లో వుంచుతూ వదినె 'ఏమిటి చెయ్యమంటారు మధ్యాహ్నానికి. రెండు కూరలూ ఒక పచ్చడి చాలునా—'

'సగ్గుబియ్యపు పరమాన్నంచేసి వడలు వెయ్యి. అమ్మాయీ నీకు వడలు వెయ్యటం బాగా వచ్చుగదులే—'

సరస్వతి గడప దాటుతూ 'ఆహా–' అన్నది.

'ఆవిడా—ఆవిడవల్ల యేమవుతుంది?' అన్నట్లు ప్రసాదరావు ముఖంలోనికి చూసింది వదినె.

సరస్వతి తనదగ్గర పాలు యిచ్చి వూరుకోపెట్టడానికి ప్రయత్నించి విఫలురాలైంది. తన దగ్గిర కూడా లేవు. ఎండిన తన రొమ్ములను కాస్సేపు చప్పరించిన కుర్రకుంక కోపంగా అంగుటి బిగించి నములుతూ మళ్ళీ బాకా ఎత్తాడు.

సరస్వతికి బక్క కోపం వచ్చి నాలుగు మొత్తింది.

'ఎందుకమ్మా వదినా—దేనికట్లా వాడ్ని బాదుతావు? నీకేమన్నా మతిపోతోందా?' అంటూ వచ్చింది నవ్వుతూ వదినె.

అల్లాగే వుంది అన్నట్లుగా దీనంగా చూసింది.

సరస్వతికి ఏమీ పాలుపోలేదు. ఆత్మాభిమానం అడ్డువస్తున్నా తెగేసి చెప్పింది—'పాలడబ్బా అఖరయిందని.'

'ఐతే వుండు. మీ అన్నయ్యను పంపిస్తాను.' అని చక్కా వెళ్లిపోయింది ఆవిడ వాకట్లోకి.

సరస్వతికి మొదటిసారి కన్నీరు చెంపలవెంబడి కారింది. చెప్ప నవుసరంలేకుండా ఎక్కడో అప్పన్నా పుట్టించి పాలడబ్బాలు తెచ్చే శాస్త్రి చేతులు—అవి ఎంతదూరాన వున్నాయో జ్ఞప్తికొచ్చి బెంబేలు పడ్డది మనస్సు.

అభిమానం - దేనికోసమైతే యింతవరకూ గ్రంథాన్ని పెంచుకునివచ్చిందో అది కాస్తా బుగ్గ తోలా 'అది కావాలి – యిది కావాలని యితరులను అడగాల్సి వస్తోంది.'

వోడిన చెప్పాలనే వెళ్లిపోయింది కాని తీరా చెప్పటానికి వీల్లేకుండా చుట్టూ ఎవరెవరో మనుష్యులూ – ఏవేవో వ్యవహారాలు మాట్లాడుకుంటున్నారు. మళ్ళీ వుత్తచేతుల్తో వెనక్కు వచ్చింది.

ఏడిచి ఏడిచి పిల్లవాడు వుత్తదూపులు చూస్తున్నాడు. కాస్త కాఫీ పట్టారు ఎల్లాగో వాడికి. నౌకరు కుర్రాడు సరిగ్గా పన్నెండు కొట్టాకవచ్చాడు 'అన్నానికెళ్తా వండమ్మగారూ—' అంటూ.

'పాలడబ్బా తెచ్చి వెళ్ళమని' డబ్బులిచ్చింది వదినె.

ఆ డబ్బు లుచ్చుకుని అదేపాళాన పోయాడు. వాడు మళ్ళా రాలేదు. పాలడబ్బా లేదు. పిల్లవాడి కడుపు వెన్నునంటుకుపోయింది. వాడు ఆకలితో అఘోరిస్తూంటే సరస్వతికి అన్న మెట్లా వెడ్తుంది లోపలికి. ఆమె భోంచెయ్యలేదు. అందుకని వదినె కూడా మానింది.

ప్రసాదరావూ అతిథులూ టంచనుగా పన్నెండున్నర కొట్టాక పీటలమీదకు దిగారు. వదినే వడ్డనంతా చేసింది. సరస్వతి బయట మంచాలు పరిచి పక్కలు వేసింది.

భోజనాలయాక రికార్డులు పెట్టడంకోసం పడకగదిలోని రేడియోవద్దకు వచ్చాడు ప్రసాదరావు. అప్పుడు యావత్తు కథా వదినె అతడి చెవిని వేసింది. అతను మండిపడ్డాడు. ఇంటికి వెళ్లి నౌకరు వెధవను జుట్టుపట్టుకు తంతా నన్నాడు. తన్నడం కాదు మనకు కావలసినది ముందు పాలు అని చెప్పాక ఎకాఎకీ మధ్యాహ్నపుటెండలో బజారుకు పోయాడు. కొట్లన్నీ కట్టేసి వున్నాయి. అటూ యిటూ తిరిగి పిల్లలుగల ఒక స్నేహితుడియిల్లు పట్టుకుని ఒక చిన్న సంచీలో కాస్త రెండుపూటలకు సరిపడ్డ పాలపిండి ముష్టెత్తి తెచ్చియిచ్చాడు అప్పు డతనివాలకం చూడ్డానికి సరస్వతికే భయం వేసింది. ఇద్దర్నీ కలిపి చెడామడా నాలుగు దులిపాడు.

అప్పుడే కొద్దిగా కోలుకుంటున్నది వైశాఖ మాసం. ఎడగాడ్పూ పెడగాడ్పూనూ. వుండివుండి అకాలంలో వానకూడా కురవసాగింది. సరస్వతికి ఏమీ తోచలేదు. నీరసంగావుండి యేపనీ ముట్టుకుందామనే అనిపించేదికాదు.

పాలుత్రాగాక కాస్సేపు యేడ్చి అట్టే నిద్రపోయాడు పిల్లవాడు. నెమ్మదిగా వోపిక చేసుకుని మెట్లన్నీ యెక్కి డాబామీదకు వెళ్లింది. అక్కడా ఎండకు గచ్చంతా మాడివుండేమో భగభగమంటోంది.

పిట్టగోడవారనే నెమ్మదిగా నడుస్తూ, ఆకాశాన యిళ్ళకు మళ్లిపోతూ గోలచేసే పక్షులగుంపులు, చెట్టాపట్టాలు వేసుకుని వూసులాడుకుంటూ షికార్లు కొట్టే స్నేహితుల్లా అక్కడక్కడ జంటలు జంటలుగా మేఘాలు—అంతకు తప్పించి యేమీలేదు. పశ్చిమాద్రిని ఎర్రటి సూర్యబింబం మునిగిపోతున్నది. దూరాన రోడ్డుమీది మనుష్యులు, వాహనాలు చిన్నచిన్న మూర్తుల్లా అగపడసాగారు. సరస్వతి మెల్లగా పిట్టగోడ అంచుమీద శరీరాన్ని మోపి రవికలో దాచిన చిన్న వుత్తరాన్ని మడతలువిప్పి చదువసాగింది. మధ్యమధ్యలో నిదానంగా యిటూ అటూ చూస్తూ, మళ్ళీ వుత్తరం చదవటాన్నిబట్టి అది ఆమె యే మూడవసారో నాలుగవసారో అయివుంటుంది—ఆమె ముఖం కొద్దిగా కుంచించుకుంది. అటు తరువాత కాస్త ఎర్రబడ్డది. మళ్ళీ కొంచెం యావ

లకువచ్చి రెండు చేతులూ వెనక్కుమడిచి ఆలోచిస్తూ నిలబడ్డది. ఒకటికి రెండుమార్లు క్రిందిపెదిమను కొరుకుతూ వెనక్కువిరిచిన చేతుల్తోనే పచార్లు చేయ నారంభించింది.

ఆ అవస్థలో ఆమె వదినరాకను గుర్తించివుండలేదు. ఆవిడ కాఫీకలరు కోయంబత్తూరు చీర నాజూగ్గాకట్టి తలలో చిన్న సన్నజాజిచెండును వుంచి మిగతా పూలను యివ్వటంకోసమంటూ, సరస్వతికోసం యిక్కడా అక్కడా వెతుకులాడి, చివరకు డాబామీద ఎవరో మనుష్యుల చప్పుడుకాగా ఆ అలికిడికి పైకి చప్పునవచ్చింది.

సరస్వతిని దూరాన్నుంచి చూడగానే చిన్న తమాషా చేయాలని ఆవిడ పిల్లిలా అడుగులో అడుగులు వేసుకుంటూవచ్చి వెనకనుంచి చేతిలోని కాగితాన్ని చప్పున లాక్కుంది.

సరస్వతి తెల్లతెలబోతూ 'నువ్వా వదినా... ఎవరో అనుకుని ఎంత హడిలిపోయానూ—' ఆ అనటంలో లోపల ఏదో దాపరికం వున్నట్లు తేలిగ్గా యివతలవాళ్ళకు తెలిసిపోతోంది.

'ఈ కాగితం విప్పనా.'—

సరస్వతి నేరస్థురాలిలా చూస్తూ వూరుకుంది. వులకలేదు. పలకలేదు.

వొదిన లేనిచొరవను తెచ్చుకుంటూ—'ఎందుకు నువ్వు అస్తమానూ వొంటరిగా దిగులుగా ఆలోచిస్తూంటావు? నీకేదన్నా కావలిస్తే నాతో జెప్పవు... నాకు తెలుసులే—నీకు యిక్కడే యింత మొహమాటం...'

సరస్వతి యీ మాటలాడే మనిషి అంతస్సులోకి చూడాలనుకుని పరిశీలనగా—'అదికాదు వదినా—నా కిక్కడేంలోటు? అడక్కుండానే అన్నీ అమర్చే వదినె... నాకోసం ముష్టెత్తడానికి కూడా వెనుదీయని అన్నగారూ... యింకా ఏమన్నా వుంటే నావల్లేవుండాలి లోసుగు...'

'అడిగినదానికి సూటిగా జవాబుచెప్పు? నీ మనస్సులో ఏదో కదుల్తూవుంటుంది అస్తమానూ—అవునా...'

సరస్వతి పిట్టగోడమీద చేతులాన్చుతూ—'ఏం చెప్పగలను—ఏం చెప్పమంటావు వదినా—' అంటూ శూన్యంలోకి చూసింది.

'పిచ్చిదానా—నాకు తెలుసు. ఇవ్వాళ అన్నయ్య నాకంతా చెప్పారు.'

సరస్వతి చప్పున వెనుదిరిగి 'అన్నయ్యా...' అని నోరు ఆవులించి పిచ్చిగా అథఃపాతాళానికి కృంగిపోతున్నట్లు అయోమయపు చూపులు చూసింది.

వొదిన సన్నజాజిచెండును మడిచి తల్లో వుంచుతూ బుజంమీద చిన్న చిటిక వేసి—'ఐతే నువ్వు పచ్చిదొంగవు సుమా—నీకు జ్వరంకూడా ఎందుకువచ్చిందో నాకిప్పుడిప్పుడు కొంచె మర్థమవుతూవుంది. అట్లాటి దేదైనావుంటే నీకన్నా కాస్త పెద్దగదా యింతముక్క నా చెవిని ఎందుకు వేశావు కాదూ?'

'ఏముక్క—' సరస్వతి అసంబద్ధమైన ఆలోచనల కూడికలోంచి తెప్పరిలలేక తలనుదించుకునే అనేసింది.

'అదే—నాకు తెలీదనుకున్నావా ఏం? అతను నిన్న వెళ్ళిపొమ్మని గసిరిన సంగతీ అదీను.'

వెళ్లిపొమ్మనా—అవును అన్నారు. అంటే వచ్చేశాను.'

'పోనీ స్టేషనుకు వచ్చన్నా టికట్టూ అదీ కొని యిచ్చాడా—'

నాదగ్గరే పదిరూపాయలుంటే, పోర్టర్ని బ్రతిమాలి కొనిపించుకున్నాను.'

చీకటి మసగ్గా అలుముకొంటున్నది. ఆకాశంలో కూడా, ఆలస్యంగా వెళ్ళే ఏ ఒకటిరెండు పక్షులో మినహా అంతా సంచారశూన్యంగా వుంది.

వొదిన ప్రశ్నాపత్రంలో కొన్ని చిక్కు ప్రశ్నల్ని వదిలేసి అడగటంవల్ల సరస్వతి తేలిగ్గా సమాధానాల్ని యివ్వగలిగింది.

చాలా నెమ్మదిగా—

'ఐతే యీ వుత్తరంకూడా చదవనా—'

సరస్వతికి 'యీ వుత్తరంకూడా—' అన్న లౌక్యపుపాడి—మెలిక విప్పుకోలేక బిత్తరపోతూ—ఇంకా యేమన్నా వున్నాయా జాబులు—'అని

ఆగింది. తన సంశయానికి అవతలి మనిషి తప్పుతీసుకుని నొచ్చుకుంటుందేమో అనుకుని.

‘మీ అన్నకు వ్రాసినవుత్తరం—అదే దాని మాటే,’ సరస్వతి సగం ఆశ్చర్యాన్ని లోపలే అణచివేస్తూ—‘ఈ వుత్తరం ఆయన వ్రాసిందికాదు’ అనేసి ఆ అనటంలోనే తనకేమీ అభ్యంతరం లేనట్లు సూచించింది.

అటుతర్వాత యిద్దరూ డాబామీద కూర్చున్నారు. వొదిన అనునయ కంఠంతో—తూచినట్లుగా ‘నీవల్ల తప్పుండదని నే నన్నా. కాని చటుక్కున అంత తేలిగ్గా వళ్ళి పొమ్మని అనటం వుంటే, అది అభిమానమున్న ఆడదానికి ప్రాణం తీసేసినట్లే.’

‘వూఁ...’

‘అదీగాక మీలో మీకు యింత వైముఖ్యం రావటానికి తగినంత పెద్దకారణం నాకేమీ గోచరించటంలేదు కూడాను.’

సరస్వతి వూగాడ్తోందికాని ఆ పెద్దకారణమేదో బయటపెట్టలేక పోతోంది ‘వొదిన చాకచక్యంగా మళ్లీ అందుకుంది—

‘అంతెందుకు? మీ అన్నయ్య వున్నారా—అంతలా చనువుయిస్తున్నట్లగపడ్తారు కాని, అబ్బో సమయంవస్తే ఆయనముట్టుకు ఎంత మగతనం చలాయిస్తారని?’

‘అల్లాగా—’ అని యింకా చెప్పమన్నట్లు చూసింది సరస్వతి. ‘మీవంశంలో వున్నదే ఒక గుణం, నీకు కోపం రాదంటే చెబుతాను.’ సరస్వతి మందహాసంగా ‘చెప్పు. నాకు కోప మెందుకు?’

‘మొండిపట్టుదల. కోపం. అవతలివాళ్ళ పరిస్థితీ మంచిచెడ్డ—కూడా ఆలోచించకుండా తాముకోరినట్లే ఎందుకు జరక్కపోవాలీ అని పంతగించుకోవడం మామూలే—’

సరస్వతి లోపల యిలా అనుకోసాగింది—యీ వరసను తన్ను చెప్పటం లేదుకదా, ఏమో! అవును వున్నమాటంటే తనెందుకు వులికులికి పడాలి!

‘అది కాదమ్మా—ఆరోజు ఆయనగార్కి తలనొప్పి జ్వరమట. ఆ సంగతి నాకెలా తెలుస్తుంది చెప్పు. మధ్యాహ్నం వెళ్లేముందు క్లబ్బుకు యివ్వాళ వెళ్తున్నానని చెప్పి మరీ స్త్రీ సమాజానికెళ్ళాను. ఆరోజు చాలామంది కలియటంవల్ల ఆమాటా యీమాటా చెప్పుకుంటూ కూర్చుండి పోయాం. బయట చల్లగావుంటే కొబ్బరి చెట్లనీడను పేము కుర్చీలు లాక్కుని. నా చిన్ననాటి స్నేహితులు ఒకరిద్దరు కలిశారు. చెప్పొద్దూ—ఆరోజు బాగా యెనిమిది దాటాకే యింటి కొచ్చాను. తప్పల్లా కొంచెం ఆలస్యంగా యింటికి రావటం—తను అంతక్రితం ఎన్నిమాట్లో రెండో ఆట సినీమాకు వెళ్ళి కూడా అర్ధరాత్రి అపరాత్రి రావటం లేదూ—అవన్నీ పట్టించుకుంటామా? దాన్తో మొదలెట్టారు ఎక్కసక్కాలు—మగవాడు తిరక్క ఆడది తిరిగి చెడిందట. నాకు వొళ్లు మండి నాలుగురోజులు యేడుస్తూ పడుకున్నాను. ఎందుకులే అన్న ముక్క అనలేదు. పలకరించిన పాపాన పోలేదు. అంతటితో వూరుకోవచ్చునా పుండుమీద కారం జల్లినట్లు అమ్మకు పనివెళా ఒక కొంటివుత్తరం రాశారు. అసలే ఆవిడ అంతమాత్రం. అల్లుడు కూడా వ్రాశాక నాకు హితోపదేశాలు చెబుతూ చాట భారతమంత జాబువ్రాసింది. ఇదేమిటని ఆయన్ని అడిగితే వెకవెకా పకపకానవ్వు—మంచీ చెడ్డావుంటేనా... వూరుకోలేదు. కోపం కొద్దీ అనేశాను. నేనేమి కాపురాలు త్రవ్వుకుని లేచిపోయే మనిషి ననుకున్నారా—యింత కుళ్లు మీ కడుపులో పెట్టుకుని ఎందుకొచ్చిన వెటకారమని—’

సరస్వతి సావధానంగా విన్నాక తన కథతో పోల్చుకోకుండా వుండలేకపోయింది. ఎంత వద్దనుకున్నా తన విషయానికొచ్చేసరికి తప్పంతా అవతలి వ్యక్తిదైనట్టుగా వాదించటానికి అంతరాత్మ ససేమిరా రావప్పటంలేదు.

‘లేద్దామా సరూ...’ అంటూండగానే ‘అయ్యో—పిల్లాడ్ని వొక్కడ్నీ వదిలేసి వచ్చామర్రా’, అంటూ సరస్వతి గబాగబా మెట్లు దిగింది.

లోపల అన్నగారు ఎత్తుకుని ఆడిస్తున్నవాడల్లా సరస్వతిని చూడ్డంతో ‘యింకే—అమ్మొయీ’ అని అందివ్వపోయాడు.

సరస్వతికి నవనాళ్ళూ కృంగినట్లయి తల కాయ వాల్చి తప్పుచేసిన మనిషిలా పిల్లడ్ని అందుకుని

అక్కడ నిల్చోకుండా నాలుగంగల్లో దొడ్లోకిపరు గెత్తుకొచ్చేసింది.

వొదిన సరస్వతి చేతులోంచి లాక్కున్న కాగితం ముక్కను చదవాలనే కుతూహలంతో నేరుగా పడకగదిలోకి వెళ్ళి బెడ్ లైట్ స్విచ్చి నొక్కి తలగడ నానుకొని మెల్లగా కాగితపు మడ తలను విప్పసాగింది. ఆ రావటంలో మళ్ళీ గదిలో కుర్చీలో కూర్చున్న ప్రసాదరావును కూడా ఆమె గమనించలేదు.

ఎటునైపునుంచి వచ్చాడో ప్రసాదరావు గ్రద్దలా ఆ వుత్తరాన్ని కొస్తా ముక్కున కర్చుకుని నిశ్చలంగా వుడాయించే యత్నంలో వున్నాడు.

ఆమెకు చాలా కోపంవచ్చిందనే చెప్పాలి. పరుషంగా—'నామీద వొట్టే అది మీరు గనుక చదివితే...'

'ఇందులో యేమిటి వుంది?'

'నాకు తెలీదు.'

'ఇది పచ్చిఅబద్దం. పోనీ ఎక్కణ్నుంచి...'

ఆమె యింకా కోపంగా—'ఎక్కణ్నుంచా నా శ్రాద్ధంనుంచి'

'అది కూడా నేనే పెట్టాలి. నాకు శ్రాద్ధం పెట్టే వాడు కలిగేవరకూ నీకు శ్రాద్ధం కావాలనుకోకు.'

'ఏమిటి శుభమంటూ తిని కూర్చుని చావుల మీదకు పోతున్నారు' అంటూ వచ్చింది సరస్వతి. ఈ ముక్కలు అనే ధైర్యం ఎట్లా వచ్చిందో వది నకు అర్థంకాలేదు. ఆశ్చర్యంతో—'ఏదీ ఆవిడ వుత్తరం ఆవిడ కిచ్చెయ్యండి.' ప్రసాదరావు రూక్షంగా—'ఐతే ఆవిడ వుత్తరం నువ్వెందుకు తీసుకుని చక్కగా మడతల్ని విప్పి కులుకుతూ చదువుతున్నావు?'

'నేనేమీ చదవలేదు.'

సరస్వతి యిద్దరితగూ తీర్చే ధోరణిలో— 'నేనే యిచ్చానన్నా బాబూ—అందులో యేమీ లేదు. మా ఆడబడుచు చెల్లాయి వ్రాసింది.'

కథ అడ్డం తిరిగిందేమనుకుని—

'చెల్లాయా...యింకా మీ ఆయన చార్జిషీటు యిచ్చాడేమో ననుకున్నాను నేను.'

ప్రసాదరావు మెల్లగా జారుకోబోతున్నాడు. వదిన గడుసుతనంగా 'పాపం! ఎందుకు జారు కుంటున్నారు. ఏమి వ్రాసిందో మీరు కూడా వినండి. ఆనక మళ్ళీ నేను ఫలానా అని చెబితే సమ్మేశస్థితిలో వుంటారు.' అనేసి నవ్వుతూ 'చిన్న వుత్తరమన్నా— పెనసలుతో వ్రాసింది పాపం, చదువుతాను—మ.ల.స. వొదినకు చెల్లాయి నమస్కా రములు. అంతా క్షేమం. మీ క్షేమం, చంటివాడి క్షేమం బొత్తిగా తెలియటంలేదు. అన్నయ్య రోజు రోజుకీ మారిపోతున్నాడు. నాకు భయం వేస్తున్నది. ఈ మధ్యన నువ్వు వస్తావనుకుని స్టేషనుకు వెళ్ళాడు. సరే—ఆవేళ వస్తూ దారిలో ఒక కోతిని పట్టు కొచ్చాడు. దానికోసం ఎంత డబ్బు కర్చు పెడు తున్నాడో చెప్పటానికి వీల్లేదు. నేనూ మొదట్లో కాలక్షేపంగా ఎంతో సరదాపడ్డానుకాని ఆ ప్రవ ర్తన చూస్తున్నకొద్దీ ఎందుకో నాకే దిగులు వేస్తున్నది. ఆ కోతి తెచ్చాడన్నా నా—దానికి నీ పేరు పెట్టాడు. అందరితో అది నా భార్య—చాలా విశ్వాసంగా వుంటుంది. అని చెబుతూంటాడు. ఇదంత చూస్తూంటే నాకు నువ్వు ఎంత చప్పనవనే అంత మంచిదని తోస్తోంది. నా ఆరోగ్యం కొంచెం బాగు. నావలన తప్పులుంటే క్షమించివస్తావని తలుస్తాను. చిన్నా నాన్నకు ముద్దులు. చెల్లాయి వ్రాలు.

వుత్తరం చదివాక వొదిన ఏమీ మాట్లాడలేదు. సరస్వతి తలనువాల్చి నేల చూపులు చూడసాగింది. ప్రసాదరావు స్తబ్ధతను భంగపరుస్తూ—

'బావ రోజురోజుకీ అచ్చం కోతిలా మారి పోతున్నాడే—'

ఈ హాస్యానికి ఎవ్వరూ నవ్వలేదు. వదినె కఠినంగా చూసింది. ప్రసాదరావు సర్దుకుని 'వెళ్తావా—' అని సరస్వతికేసి చూశాడు.

ఆ వెళ్తావా అనటంలో దిగబెట్టివస్తాననే. అర్థం ఎక్కడా సరస్వతికి తట్టలేదు. గ్రహించిన వదిన భర్త వాక్యాన్ని సర్దుతూ 'నీకు వెళ్ళటం యిష్టంగా వుండకపోతే ఎందుకు ఆయన్నే యిక్క డకు రప్పించే యేర్పాటు చేస్తేసరి!'

సరస్వతి వెంటనే 'రారు' అనేసి మళ్ళీ చప్పున సిగ్గుపడిపోయింది.

ప్రసాదరావు నసిగాడు. 'నే నతను పంపమని వ్రాసినదానికి సమాధానం వ్రాయలేదు కూడా.'

సరస్వతి గాబరాగా తలెత్తింది. అంతవరకూ తన్ను పంపమంటూ జాబు వచ్చినట్లే ఆమెకు తెలియదు. చెల్లాయి వుత్తరం పూర్తిగా యిప్పుడు బోధపడినట్లే.

ఆ రాత్రి పసిపిల్లణ్ని పక్కలో పెట్టుకుని యేడ్చినది యేడ్చినట్లే వుంది సరస్వతి. అప్పుడు యిల్లా అనుకోసాగింది—'నేనే పాపిష్ఠిదాన్ని. చేతులారా నా కష్టాలు నేను కొనితెచ్చుకున్నాను. మా అన్నయ్యా వదినా నన్నెంత గౌరవంగా చూస్తున్నారో చెల్లాయిని ఆయనట్లా చూసుకోవటం సహించలేకపోయాను. నా అసహనం నన్ను కోతిని చేసి పారేసింది. ఆయన కోతిని తెచ్చి దానికి నా పేరెట్టారని అభిమానపడి యేం ప్రయోజనం? ఎవరు విన్నా చివరకు నేను చేసిందే కోతిపని అంటారు? ఏ మొహం పెట్టుకుని నేను ఆ మహారాజు పంచలకు చేరుకునేది?' సరస్వతి ఆలోచనల బరువులో దొర్లిన గంటలను గుర్తించలేక, కోడికూతవిని అప్పుడే తెల్లారిందా అనుకోసాగింది.

4

బండీవచ్చి గుమ్మంముందు ఆగింది. చదువుతున్న పత్రిక పుటల్ని త్రిగించి ప్రసాదరావు ముందుకు చూశాడు. అప్పుడే ముగించి విడచిన కాఫీకప్పు నొత్తిగించటంకోసమని ప్రత్యేకంగా వచ్చిన వొదిన నోరు తెరచి విస్తుబోయి చూస్తున్నది.

మెట్లదాకా వచ్చాక — 'మేమేనర్రా—ఏవిటట్లా గుడ్లప్పగించి చూస్తున్నారు?' అంటూ పైకి రావటంకోసం వూతకర్రను బలంగా నేలకు అదిమి వెనుకకు వినిపించేలా—

'అమ్మో—నువ్వుకూడా నాతో లుడుంగున యింట్లోకి జొరబడకు. పశుచుదానివి యింకా, కాస్త సామాన్ను లోపలకు జేరవేయించు.'

వాక్యం ముగియకుండానే అవతల చేతులోని సిగరెట్టును బహు చాకచక్యంతో నులిమేసి లేస్తూ ప్రసాదరావు వాకిట్లోకి గబగబా నాలుగడుగులు వేశాడు.

గుమ్మంలో నిల్చున్న పార్వతమ్మ—'ఏంరా నాన్నా—కులాసా? కాశీ వెళ్దామని బయల్దేరదీస్తే వున్న పాళాన యిలా వచ్చేశాం. మీ నాన్నగారితో ఏదొచ్చినా నోట్లోమాట నోట్లో వుండగానే కావాలి పనులు. లేడికి లేచిందే పరుగు.'

'నువ్వు లోపలికి నడు—నేం చూస్తాన్లే...'

తరువాత జట్కావాలాతో చిన్న యుద్ధకాండ పావుగంటసేపు జరిపి డబ్బులు మొహాన్న విసిరికొట్టాక, మెల్లగా లోనికి వచ్చాడు ప్రబుద్ధుడు ప్రసాదరావు.

అప్పటికే తల్లీకూతుళ్ళ సాశ్చర్యసంభ్రమాభిమానాల్ని ప్రకటించుకోవటం కుశలప్రశ్నలవరకూ సంభాషణ రావటం జరిగింది.

ప్రసాదరావు వచ్చిచూసిన దృశ్యంయొక్క సందర్భం యిది.

సరిస్వతి తల్లిని రెండు చేతుల్తో పట్టుకొని వెక్కి వెక్కి యేడుస్తున్నది. ముసలాయన చంకలోని పిల్లవాడు పండిన ఆయన మీసకట్టును చూసినంతసేపు చోద్యంగా చూసి, చేతుల్తో అందుకోవటంకోసం విశేషించి యత్నిస్తున్నాడు.

ప్రసాదరావు భార్య వూరంత గొంతుకతో వార్తల్ని చదువుతున్న రేడియోగొంతు నొక్కివచ్చి, మెల్లగా సరస్వతిని దొడ్లోకి నడిపించుకువెళ్లింది. ఆడవాళ్లు ముగ్గురూ విడిపోగానే ముసలాయన కళ్ళజోడును మనుమడి బారినుంచి భద్రంగా రక్షించుకొంటూ కొడుకు నుద్దేశించి 'ఏమిటి కథ?' అన్నారు.

ప్రసాదరావు తనకేమీ తెలియనట్లు 'ప్చ్' అనేసి వూరుకున్నాడు.

'ఎప్పుడు రావటం?'

'నెల్లాళ్ళయి—'

'నాకు తెలియలేదే...'

కొడుకేమీ జవాబివ్వకపోవటం చూసి— 'యిదా... నాకేమీ క్షేమసమాచారాలు తెలియక పోవటంచేత ఒకమారు అట్లా వెళ్లివానా అని కూడా అంటూవచ్చాను. మీ అమ్మే—వట్టి చండ్రోడిమనిషి ఎద్దు ఎండకు లాగితే దున్న నీడకులాగుతానంటుంది.'

'వెళ్ళిరావలసింది. కథంతా అర్థమయేది—' చేత్తో చిన్న పూచికపుల్లను విరిచి పళ్లుకుట్టుకుంటూ నసిగాడు కుర్చీతోసహా వెనక్కి నడుం విరుచుకుంటూ.

'హా, హా—ఏదో వుంది.' అన్నారు ముసలాయన.

పూచికపుల్లతో గాలిలో సూచిస్తూ 'ఇప్పుడేం లాభం అనుకుని—అటువంటి సంబంధం చేశాక—'

ముసలాయన ఒక్కమాటు బుజాల్ని దులుపుకుని చేతిలోని కర్రను కుర్చీవెనక వ్రేలాడేస్తూ—'ముసలాడి కబుర్లు నీకు పచ్చిపచ్చిగా వుంటాయిగాని, యీ తల పూర్తిగా పండేదాకా నౌకరీ చేశానా, దేశంకాని దేశం అక్కడా యిక్కడా వుంటూ వచ్చానా, ఎన్నిరకాల మనుష్యుల్ని చూడలేదు? అంతా ఒక్కలా వుండరు. అదలా వుంచు. ఎప్పుడూ మనమే నెగ్గాలనుకునే మనస్తత్వంకల మనుష్యుల్ని చూశాను. కొన్ని సందర్భాల్లో గెలుస్తూ మళ్ళీ వోడుతూ జీవితం సాగించే వ్యక్తుల్ని చూశాను. పట్టూ విడుపూ అన్నదుండాలి. అదిలేని వ్యక్తుల్తో అందులో హమేశా మనమే ముందుండాలి మనమే నెగ్గాలి అనుకునేవాళ్ళతో జీవించటం ప్రమాదకరం. మీ అమ్మవుందా — అది కాపురానికొచ్చిన క్రొత్తల్లో వట్టి అడివిగొడ్డు. మొరాయించటం కరవటం వుండేదికాదు. ఆఖరికి నాకు తెలియకుండా అణా అర్థా తీసి యే పోపులడబ్బాలోనన్నా జేరేసి ఒక పదిరూపాయలు చేస్తుందేమో అని చూశాను, ఆ తెలివితేటలు కూడా లేవు. కాని అట్లాటి మనిషితో కాపురం నాకేమీ కష్టమనిపించలేదు. కాని మళ్లీ మీ చిన్నత్త— చచ్చిపోయిందిలే, నువుపుట్టాక. అందుచేత తెలీదు. ఆవిడ మొగుడ్ని రాచిరంపాన పెట్టేదని నలుగురూ అనుకునేవారు. నాకేం మొహమాటం లేదు. అడిగేద్దామా అన్నంతవరకూ వచ్చింది. కాని చూస్తూచూస్తూ ఆడబిడ్డను నేనేమన్ను. ఒకమాటు దాన్ని పుట్టింటికి తీసుకురమ్మంటె నేనే బయల్దేరి వెళ్లాను. గుమ్మంప్రక్కనే స్కూలు. ఆ బడిపిల్లలు కిటికీదగ్గరకువస్తే పల్లంలో వీళ్ళ దొడ్లో అంతా కనబడ్తుంది. అప్పుడు వాళ్లేదో అంటున్నారు. ఇది వాళ్ళను చెరిగేస్తోంది తిట్లతో. ఏమిటే ఆ పిల్లలు అంటున్నది అని అడిగాను రావటంతో. దానికి నామీద కూడా కోపమొచ్చింది. తరువాత తెలిసింది 'అయినకాడికి అణాపరక—' అని పిల్లలు పిలుస్తారని. బజారుకి ఆ వూళ్లో పనిమీద బయలుదేరితే ఏ గోడమీద చూసినా అయినకాడికి అణాపరకా. ఒక గుంటవెధవని పిలిచి 'ఏంరా—ఆమాట' అన్నాను. వాడు నవ్వుతూ పరుగెత్తుకుపోయాడు. నేను స్వతహా కొంటెమనిషిని—ఆరోజు దీపాలుపెట్టాక దార్లో ఎదురైతే 'ఏమిటి బావా—అయినకాడికి అణాపరక అని రాసుంది మీ యింటిమీద—' అని ఖర్మంజాలక నోరుజారాను. అగ్గిరుద్రుడయాడు. ఎట్లాగో తెలుసుకున్నాను. ఒకరోజున వుదయం 8 గంటలకు బజారుకని బయల్దేరి, ఏవో ఒక తోటకూరకట్ట కాసిని పచ్చిమిరపకాయలతో అణాకుపెట్టాట్ట యింట్లో. స్కూల్లో ఒకటికి బెల్లుకొట్టారు. అప్పుడు మీ చిన్నత్త చింతరుప్పలాటి తలేసుకుని తడిసిన చీరతో వురుముకుంటూవచ్చి 'ఏమిటి తగలేశావు?' అందిట. 'ఫలానా—' అన్నాక 'ఎంతయింది?' అని గర్జించిందిట. 'అణాపరక—' అన్నాక ఆలస్యమయిందని శాపనార్థాలు పెడుతూ 'ఇంతేనా అయినకాడికి అణాపరక' అంటూండగా స్కూలు పిల్లలువిని ఆ ముక్క పుచ్చుకున్నారు.

ఇంత కథా నీకెందుకు చెప్పానంటే, ఆవిడ పోలికే అచ్చంగా మన సరస్వతి.'

ప్రసాదరావు రూక్షంగా—'మీ కసలు ఏం తెలీదు. మీరు దానికి చాలా అన్యాయం చేశారని నేననబోతున్నందుకు ముందుగా యింత చరిత్ర చెప్పుకొచ్చారు. నాకు తెలుసు నాన్నా—ఇంకా ఏం కావాలి? నిల్చున్నపాళాన చంటిబిడ్డతో యింట్లోంచి పొమ్మని అన్న మనిషికి ఏపాటి సంస్కారం వుంటుందనుకునేది?'

'అతనలాటి మనిషి కాడు.' ముసలాయన సమర్థిస్తూ గట్టిగా అన్నారు.

ప్రసాదరావు క్షణంసేపు లేచి నిలబడి పరుషంగా—'మీరు చేసింది తప్పుకాదని సమర్థించుకోవటంకోసమే చూస్తున్నారుగాని మన గౌరవం ఏమాత్రం అతగాడు నిలబెట్టాడో ఆ విషయం ఆలోచించటం లేదు.'

ముసలాయన యీలోగా 'అమ్మీ కొంచెం 'టీ' పట్రా. సుపుత్రుడు దేవతలకు పంచాంగాలు

చెబుతున్నాడు.' అనేసి 'కూర్చోరా నాన్నా—కూర్చో...' అని ప్రసాదరావునుద్దేశించి అన్నారు.

ప్రసాదరావుకు వోటమి యిష్టం లేదు. ఆయన వాదించి తన చేత అవుననిపిస్తారనే భయం లేకపోలేదు లోపల. అదికాక స్వయానా కూతురి విషయంలో ఆయన అల్లుడిపక్షం తీసుకోబోవటం చూస్తే తనకే ఎల్లానో కచ్చగావుంది. అందుచేతే లేచి తప్పుకుపోవాలని చూశాడు.

ముసలాయన అన్నారు.

'ఈ ఒక్క మాట విను. నీకు తెలిసింది, చాలా మంది అనుకునేది మనుష్యులంతా డబ్బుగలవాళ్ళు, లేనివాళ్లుఅనే. ఈ రెంటి మధ్యా సంబంధబాంధవ్యాలు పోసగవనే. పైగా యీ విభజనలో తప్పుందంటాను నేను. మనుష్యుల్ని తత్వాలవారీగా విభజించి పరీక్షించాలంటాను. శాస్త్రిని నేను అట్లానే కొల్చి చూశాను. అతను యితరులకు కష్టం గలిగించడు. ఇతరులు తనకు కలిగిస్తే ఓపికతో సహించి వూరుకుంటాడు. బస్. యిక నీవు వెళ్లచ్చు.'

'మరి యీ జరిగిన రాద్ధాంత సిద్ధాంతాలన్నీ'

'ఏ రాద్ధాంత సిద్ధాంతాలు...?'

'ఇదిగో ప్రత్యక్షంగా కనబడుతున్నదే పుట్టింటికి తోలెయ్యటం—'

'హా! అదా - ఏదో మాటామాటా వస్తే అమ్మాయే వచ్చేసుండచ్చు. మన బంగారమే మంచిదని అస్తమానూ అనుకోవడం తప్పురా. ఎదటివాడి కంట్లో దూలం వెతికేముందు మన కంట్లో నలుసు అఘోరించిందేమో చూసుకోవద్దూ.'

'చూసుగోవాలి—' అని కోపంగా అనేసి ప్రసాదరావు చరచరా వీధిలోకి నడిచాడు. సరిగా అదే సమయానికి ప్రక్కగదిలోనే వుండి యావత్తూ కాకపోయినా కొంత కొంత విన్న ప్రసాదరావు తల్లి యీవలకు వస్తూ—'ఇంకా కొంపలో అడుగుపెట్టి పది నిమిషాలు కాలేదు. ఏవిటి వాడినల్లా వెక్కిరిస్తున్నారు? ఏదో మర్యాదగా వచ్చాం—నాల్రోజులుండి మర్యాదగా వెళ్ళాలని లేదా మీకు?'

'హుష్. వూరుకోవే—తగుదునంటూ వచ్చావు నడాన. నేను ధర్మంకోసం పాటుపడుతాను. ఎప్పుడు ఎక్కడెక్కడ ధర్మం నశిస్తుందో అక్కడల్లా పుట్టుకొస్తానని కృష్ణపరమాత్మ చెప్పలే. గీతల్లో...'

'ఓహో - యిదే కామోసు ఆ అవతారం. చాల్లెండి. అనవసరంగా పిల్లల మనస్సులు నొచ్చుతాయి. వాళ్ళేం అజ్ఞానులు కారు. ఎవళ్ళ వాళ్ళంత వాళ్లు వాళ్ళయారు. మీ రూరికే నోటికొచ్చినట్లల్లా......'

'నువ్వు ఫో—ముందు అవతలకి...' ముసలాయన గర్జించారు. మధ్యలో కోడలు వచ్చి-'మావయ్యగారూ మీకు వోల్టీను తెచ్చేదా......' అని సమాధానంకోసం నిలబడ్డది.

'ఏవి మర్యాద? ఏవి మర్యాద? మూడు పిల్లలంటే అలా వుండాలి.' ఆవిడకు వినిపించలేదు ఆ మాటలు. మళ్ళీ అందుకుంది.

'ఐతే మీరు ఏవిటి అమ్మాయిని దాన్ని కాస్త పలకరించారూ?' ఆయన ముఖం కుంచించుకుని 'పోదూ—నీ తెలివికి సంతోషిస్తున్నాను. నేను ఆ విషయం ఎత్తితే అది చిన్నబుచ్చుకుని ఏడవదూ—'

ఇంతలో వోల్టీను పుచ్చుకునివచ్చిన కోడలును పరామర్శగా 'మీ అమ్మ అంతా బాగున్నారా? జాబు లొస్తున్నాయా?'

తల వూపుతూ కప్పును బల్లమీద వుంచి—'అత్తయ్యా...మీరు...' అంది. ఆవిడ అధికార పురస్సరమైన ధోరణిలో—'నాకేం అక్కర్లేదమ్మా. అబ్బ! అందులో ఏదో కోడిగుడ్డుసొన కూడా వేస్తారట. రామ! రామ! ఆ వోల్టీన్లూ అవీ అట్లాటి సూకరాలు బస్తీవాళ్లూ నాగరికులు మీకు గాని...'

ముసలాయన లేచారు. మీది సిల్కు కండువాని ఎక్కడ తగిలించటమా అని యిటూ అటూ చూస్తున్న ఆయనకు ముసలావిడ మాటలు వినిపించాయి. చేతిలోని కండువాని అందుకోవటంకోసం వస్తున్న కోడల్నుద్దేశించి—పద్యం చదివే ధోరణిలో 'రుచిపాకము నాలుకగా కెరుంగునే, తెడ్డది కూరలో కలియు' అని వూరికే అన్నాడు భాస్కరశతకకర్త.

ఆ అమ్మాయి కండువా వంకీని తగల్చటంకోసం అక్కడనుంచి నిష్క్రమించాక ఆవిడ యీ అన్న ముక్కలకు వూరుకోలేదు.

'పిల్లలదగ్గర అట్లా తీసిపారేస్తావస్తే నేనంటే యేమన్నా చీమకాలంత గౌరవం వాళ్లకిక ఎందుకుంటుంది?'

'అందుకే అన్నారే వెఱ్ఱిదానా— మొగుడు తిడితే మొగసాలవాడూ తిట్టాడని.'

'నాకు గౌరవం అనేది లేదని ఎల్లానూ తెలుసు. మీతో దేనికి గాని వాదన—అమ్మాయి సంగతి కాస్త కనుక్కొండి మీరు వెళ్లటమో, అతగాడికి కబురు చెయ్యటమో—'

'ఏమని? నువ్వు కాస్త నోరు మూసుకుంటే అన్నీ అవుతాయి. కాశీనుంచి వచ్చేప్పుడు చూద్దాములే.'

'దారిలో పనిగదా—'

ముసలాయన క్రుద్ధులై నిష్కారంగా— 'ఇప్పుడు నావల్ల కాదు. వచ్చేటప్పుడు చూద్దామన్నానుగా.'

ఆవిడ ప్రక్కకు తిరిగి చెంగుతో కళ్లు నొత్తుకుంటూ బొంగురు చేసుకున్న గొంతుకతో 'అంతే దాని ఖర్మ. రేపు ప్రొద్దున్న నలుగురూ ఏవమ్మా మీ అమ్మాయి యింకా యిక్కడేవుందేమంటే నేనేమని చెప్పేది? నలుగురూ నన్ను దుయ్యబట్టుకుంటారు గాని...'

ఆయన ఒక్కమారు లేచినిల్చొని–'చాల్చాలు యింక అధికప్రసంగం చెయ్యకు. ముందు నువ్వే మా అమ్మాయిని వొదిలేశాడని నలుగుర్లోనూ చాటొచ్చేటట్లున్నావు.'

'హవ్వ! రామ! రామ!' అనేసి ఆవిడ నెమ్మదిగా అక్కడ్నుంచి నిష్క్రమించేలోపున ఆయన నున్నటి తలను పదేపదే రాసుకుంటూ పచార్లకు ప్రారంభించారు. దూరంగా నేలమీదకు గంటన్నర క్రితమే వదలి వేయబడ్డ మనవడు అక్కడే నిద్ర తీసి అప్పుడే లేచి మెడను రిక్కించి తాతగారి పచార్లను బుర్ర రాసుకోవటాన్ని పరిశీలనగా చూడసాగాడు. కాని అట్లా వాడు ఎంతోసేపు పెద్దమనిషి తరహా అభినయించలేదు. చరచరా మోకాళ్లతో ప్రాకి ఆయన అప్పటివరకూ కూర్చున్న కుర్చీముందు వుండే విరుగుడుచావ సుంద్రబల్ల క్రిందకుచేరి, అంతక్రితము ప్రసాదరావు నలిపి విసిరేసిన సిగరెట్టు పీకలను సునాయాసంగా ప్రోగుచేసి వాటితో ఆడుకోవటంలో నిగ్నుడయాడు.

తాతగారు ఆలోచనామగ్నులై యిట్నుంచి అటూ అట్నుంచి యిటూ వోపట్టీను అరిగేదాకా పచార్లు చేశారుకాని బల్లక్రింద ఆడుకుంటున్న మనుమణ్ణి పోల్చుకోలేకపోయారు.

ముసలావిడ వంటలోకి దిగింది. కోడలు బహు జాగ్రత్తతో మడిగట్టుకుని ఆవిడకు అదీయిదీ సరఫరా చేస్తున్నది. కాని యీ వ్యవహారంలో ఏమాత్రం హెచ్చుతగ్గులు వచ్చినా అత్తగారు సహించి వూరుకోదు—'నేను కాపురానికొచ్చిన క్రొత్తల్లో...' అంటూ ప్రారంభిస్తుంది.

ఇదివరకే అంతమాత్రపుపని–సరస్వతి కిప్పుడు చేతికి నిండా తీరిక. గంటసేపు కూర్చుని తీరిగ్గా జప అల్లుకున్నది. తరువాత తువ్వాలు సబ్బుబిళ్ళ పుచ్చుకుని స్నానాలగదిలోకి వెళ్లింది. అయోగ్య యింత నిదానంగా పనులు చేసుకుంటూ కూర్చుంటే అవతల వంటా అదీ చూసుకోవాలి, యిల్లు చక్కబెట్టుకోవాలి అనటానికి యిది తన యిల్లు కాదు. ఈ పనులు పూర్తిచేసిసకాలంలో అదించవలసిన ఆ బాధ్యత, అదీ తనకు లేదు.

అది చాలా చిన్నగది. ఒక ప్రక్కంతా పొగతో నల్లగా మసిబారిపోయింది. క్రిందగా ఒక పెద్ద పొయ్యిలో భగభగా మండుతున్నవి నాలుగు పెద్దకట్టెలు. ఆపైన వెడల్పైన నల్లటి రాగిగాబు. అందులో రెండుబిందెలనీళ్లు ఏకధాటిన సలసలా మరుగుతాయి. కట్టెలు బాగా మండుతున్నవేమో, ఒక వైపునుంచి సెగలు వస్తూండేగా, సరస్వతి తలుపులు బిగించి, కుర్చీపీటను లాక్కుని, అందుమీద ఒక కాలునుంచి పోసుగుంటూ నీళ్లు—మధ్యమధ్యను వొళ్లు రుద్దుకున్నచోటే మళ్ళీమళ్ళీ రుద్దుతూ గంటన్నరసేపు జలకమాడింది. అంతసేపూ తన వొళ్లు తాను చూసుగుంటూనే వుంది. చేతులు నీళ్లను పాళంగా తోలుపుతూనే వున్నాయి. స్నానం పూర్తవుతూనే వుంది. కాని మనస్సు మనస్సులో లేదు. ఇప్పుడు తన బ్రతుకు పరీక్ష తప్పిన కుర్రవాడి మోస్తరయింది.

అంత వేడినీరు శరీరంమీదుగా పరుగెడుతూన్నప్పుడు సరస్వతికి తన కాపురం మొదటి దినాలు

గుర్తుకొచ్చాయి. ఆ ఆలోచనలు గూడా 'సంబంధపు చర్యలు—' అట్నుంచి 'పెండ్లిచూపులు'— 'బీదా గొప్పా తారతమ్య వివరణ'—పలువురూ పలు విధాలుగా చేసిన సూచనలు, ఎల్లాగో అయిన పెండ్లి, మధుపర్కాలు, దండాడింపు అన్నీ చకచకా తిరిగిపోయాయి.

అటుతరువాత శాస్త్రిని గురించి తియ్యగా వూహించటానికి మొదలు పెట్టిన రోజునుంచి, అతణ్ని చూడగానే ఎవరో వెనుకనుంచి వచ్చి గిలిగింతలు పెట్టినంత వుత్సాహంతో పులకలెత్తిన తను-ఏరోజు కోసం యువతీ యువకులు రాత్రిళ్ళూ పగళ్ళూ వువ్విళ్లూరుతూ ఆలోచిస్తుంటారో, ఆ దినం - తను ఎట్లా వర్తించింది? ఏమేమి చేసింది ఒక్కమాటు గుర్తుకు తెచ్చుకోకుండా వుండలేకపోయింది సరస్వతి.

సరస్వతి కప్పటికి యింకా పదహారేళ్లు నిండలేదు. వోణీలు మానేసి కూడా ఏడాది పూర్తయిందో లేదో—యింటికి వచ్చిన అమ్మలక్కలంతా 'పిల్ల ఎత్తరి—మనిషవుతుంది.' అంటూంటే ఆ ముక్కలు బోధపడకపోయినా వాటివెనుక ఏదో తీయటికల వున్నట్లు అనిపించేది తన మటుక్కి. ఆ రోజుల్లో ఎంతసేపూ దృష్టి ముస్తాబుమీదే వుండేది.

పండగలకు పిల్చినప్పుడల్లా శాస్త్రి వస్తూండేవాడు. మొదటిసారి చెల్లెల్నికూడా వెంటబెట్టుకొస్తే, ఆ పిల్లను తాను ఎంత వేళాకోళం చేసింది— ఏదోవంకను ఆమె బట్టలనో అలవాట్లనో హేళనగా తీసి కట్టుగా విమర్శించినదీ, అవన్నీ గుర్తుకొస్తున్న కొద్దీ సరస్వతి యిప్పుడు విచారించకుండా వుండలేక పోతున్నది. ఒక్క లేని తనాన్ని మాత్రమే శాస్త్రి తమ యెదుట విధిలేక ప్రదర్శించవలసి వచ్చినపుడు అతను బికారిలా వుంటాడని, మావగారివద్ద నుంచి వచ్చినప్పుడల్లా డబ్బు గుంజుకుపోవటమే ప్రధానాశయంగా పెట్టుకున్నాడని తనవారు ఆఖరికి తల్లికూడా ఆ నోటా ఆనోటా తనముందరే అంటూ వచ్చినప్పుడు అభిమానవతియైన మరొక స్త్రీ యేం చేసేది? తనుమాత్రం యివతలిగట్టునే నిలబడి చేతుల్ని కట్టుగుని నలుగురూ తిరస్కారంగా అనుకునే మాటలకు వూతాన్ని యిస్తూ ఎంత ముభావం నటించలేదు? ఆరోజున అమ్మలక్కలు తాంబూలాలు తీసుకున్నాక కొంగున కాసు ముడివెయ్యలేదని, అంతమాత్రం లేకపోయిందా అన్న భావంతోనే తెల్లవార్లూ తలుపు నానుకునే నిలబడి పెడముఖంగా వుంటే అతనేమన్నాడు? పల్లెత్తుమాట అనకుండా గుప్‌చుప్‌గా మూడురోజులూ ఖైదులో కూర్చున్నట్లు గడిపి మళ్ళీ వచ్చాక తీసుకవెళ్తానని అనేసి దాటుకున్నాడు తన బారినుంచి. అవతలవాళ్లు తీసుకెళ్ళటంకోసం మనిషిని పంపినప్పుడుకూడా యేడ్చి యమలోకానికి పోతున్నదానిలా పెద్దపెద్ద రాగాలతో వెళ్లినప్పుడు స్టేషనులో అతను ఎదురువచ్చి ఎంతో మర్యాదగా యింటికి తీసుకవెళ్ళాక కూడా మూడు నెలలు తను ఎన్ని చెరువుల నీళ్లు త్రాగించినా పైకి ఏమన్నా తేలాడా! అటువంటి శాస్త్రిని తిరిగి నలుగురూ కోతి అంటూండటాన్ని తను యీమాత్రం పరిజ్ఞానం వచ్చాక కూడా వింటూ సహించి ఎంతకాలం ఎట్టా వూరుకోగలదు? ఇప్పుడు పిచ్చివాడుకూడా అవుతాడేమోనని చెల్లాయి వ్రాసింది. ఎవరు కారణం! తనే. తనే. తనే. తన మూలకంగా అతడు సర్వనాశన మవుతాడు. డేగిసాలోని నీళ్లన్నీ కర్చయాక యివతలకు వచ్చిన కూతుర్ని వుద్దేశించి—'ఎక్కడున్నావేఁ యింతసేపూ స్నానమేనా...' అంది తల్లి.

'ఆఁ' అనేసి గడపదాటుతుండగా చంటివాడు ఆడుకుని వదిలేసిన గిలక్కాయి ఎర్రగా దృష్టిని పడ్డంతో సరస్వతికి ఒక్కమాటు వొళ్లు ఝల్లుమంది. 'పిల్లవాడు ఏమైనట్లు—'

చిన్నగుడ్డతోనే నాలుగు గదులూ అలంగం తిరిగి వంటయింట్లోని వదినగారివద్దకు వచ్చి తడబడుతూన్న గొంతుకతో 'నానిగాడేడి?' అంది.

ఆవిడ చెంబును క్రిందవుంచుతూ 'వాకిట్లో లేడా—యిందాక చూశానే...'

'ఏమోనమ్మా...' అంటూ మళ్లీ దొడ్డంతా కలయతిరిగింది.

పొయ్యిదగ్గర కూర్చొని సంతనాగా వండుతున్న ముసలావిడ పోపుకోసం మాడబెట్టిన బాణల్ని యిటుకముక్కలతో గమ్మున దింపి 'అయ్యొ నా కూతురా—ఎక్కడ వదిలేశార్రా బిడ్డను—చప్పున వెతకండి. చప్పున వెతకండి.' అంటూ ముందరగా నూతి ఎగ్గరకు పరుగెత్తింది. తల్లి నూతిదగ్గరకు దారి తియ్యటంతో బెంబేలు పడి సరస్వతి గుడ్లనీరు గ్రుక్కుకుంటూ అనుసరించసాగింది.

ఆశ్చర్యంగా వుందే—' అంటూ వదినగారు యిల్లంతా చుట్టివచ్చి, అంతక్రితమే పచార్లను ముగించి మధ్యగదిలో నరసారావుపేట కుర్చీలో పరుండి అర్ధనిమీలిత నేత్రాలతో ఆలోచిస్తూన్న ముసలాయన్ను అడిగింది— 'పిల్లవాడ్ని ఎక్కడన్నా చూశారా' అంటూ.

ఆయన హఠాత్తుగా విన్నారేమో ఆ లేవటంలో టప్పుమని ముక్కు మీదనుంచి కళ్లజోడు జారి గచ్చు మీద పడి బ్రద్దలయింది. కోడలు ఆ ముక్కల్ని ఏరటంకోసం నేలను వంగినప్పుడు టీపాయిక్రింద చేరి ఆడుకొని అలసి నిద్రపోతున్న పిల్లకుంక ఒక మూలను సాక్షాత్కరించాడు.

'ఇదుగోనర్రా యిక్కడున్నాడు—'

గుమ్మందాకా నడిచి ఎండలోకి గాబరాగా చూస్తున్న ముసలాయన 'యేడి యేడి' అంటూ వచ్చి 'అమ్మదొంగా – యిందాక నేనే అబ్బాయితో మాట్లాడుతూ మాట్లాడుతూ నేలకు వదిలేస్తే దీని క్రిందకు జేరాడు గావును.' అని పూర్తిచేశారు.

ఎరుపెక్కి ధారలుగట్టిన కన్నీళ్ళతో తడిసిన సరస్వతి ముఖాన్ని చూడగానే తండ్రి హృదయం చప్పున కరిగి—'యిదుగోనమ్మా—' అంటూ అందిచ్చిన చేతుల్తో తలమీద నెమ్మదిగా నిమిరి 'ఎంత గాబరా పెట్టేశాడో యింటిల్లపాదినీ వీడు. అమ్మ ముండా! కళ్ళజోడుకూడా విరిగిందిరా నీమూలాన.'

మాటలో అడ్డువస్తూ అమ్మమ్మ—'ముండా గిండా అనకండి వాడిని – వాడికి మీ పేరే పెట్టారు కూడా.'

సరస్వతి చెంగుతో నీళ్లు వొత్తుగుంటూ పిల్లవాడ్ని తీసుకుని వెళ్లబోతోంది. గొంతు సవరించుకుని అన్నారు తండ్రి—'ఏమే అమ్మాయీ మాతో కాశీ వస్తావా—యాత్రలు చేసొద్దుగాని.'

మడిలో వున్న పెద్దావిడ నోరు నొక్కుకుంటూ—'దాన్నెందుకండి కాశీ ప్రయాణం చేస్తారు?' అంటూ అడ్డుపుల్ల విసిరింది.

'అది కాదే భడవా—ఏమన్నా పాపాలు చేసుంటే అవన్నీ గంగలో కడిగేసుకోటానికి.'

'అది కుర్రపిల్ల—దానివల్ల ఏయే పాపాలు జరిగుంటాయని—'

'ఏయే పాపాలా - మొగుళ్ళను యేడిపిస్తే వచ్చే పాపాలు.'

'చాల్లెండి. ఎవరైనా వింటే నవ్విపోతారు?'

'అయ్యో ఖర్మవా—అస్తమానూ ఎవరో వింటారు. ఎవరో ఏదో అంటారు అని ఎవరికోసమో బ్రతుకుతున్నట్లు అఘోరిస్తావేమిటి? మీ ఆడజాతి చేసే ఘోరాల్లో భర్తలను క్షోభపెట్టి అలోలక్షణా మనేట్లు చెయ్యటంవుందే—దానికోసం కాశీ వెళ్తే జీవితంలో ఒకమాటు మంచిదంటాను నేను.'

'మరి మీరెందుకు అయితే—'

'అల్లా అడుగు లెక్క చెబుతాను. మీరు చేసే దరిద్రగొట్టు పనులన్నిటికీ చిత్రగుప్తుడి దగ్గర జవాబుదారీ వహించేది మేము. అంటే మేం చేసుకున్న పుణ్యమేదన్నా వుంటే అది కాస్తా మీమూలంగా బ్యాంకులో డబ్బులాగా హరించిపోకుండా వుండేందుకు.'

'అయ్యో బాబో—మీరు దేముడితో కూడా గీచి గీచి బేరమాడేటట్లున్నారు పాపపుణ్యాల విషయంలో.'

'బేరమా—నా ఎదురుగుండా వచ్చి నిలబడితే భగవంతుడ్ని కూడా లెక్కల్లోకి గుణింతాల్లోకిదింపి చివరకు కొసరు వేయించుగుంటాను. రాధే శ్యామ్. రాధే శ్యామ్. వెళ్లండి వెళ్లండి. నా కళ్ళజోడు ఆయువు మట్టం కావటానికొచ్చింది యీ హడావిడి. లేకపోతే నిక్షేపంలా యింట్లో వున్న బిడ్డడికోసం—ఒకరు వీధిలోకి ఒకరు నూతిలోకి పరుగులుచ్చుకున్నారు. ఛీ! ఛీ!'

సరస్వతి యీ సందట్లో నెమ్మదిగా జారుకుని మరో చీర మార్చి పిల్లడికి పాలు గ్రుటాపట్టి చాప పర్చుకుని నెమ్మదిగా చిన్న కునుకు తీయటానికారంభించింది. ఆ పసివెధవ కాళ్ళను తపాతపా కొడ్తూ కేకలు పెడ్తూ కేరింతలు గొడ్తున్నాడు.

ఆ రోజురాత్రి వున్నట్లుండి సరస్వతి హఠాత్తుగా ఒక నిర్ణయానికొచ్చేసింది. తెల్లవారి లేచాక ఎందరు చెప్పినా వినలేదు. ఎదురు మాట్లాడిన వారందరితో చెడామడా తగూలాడేసింది. ప్రసాదరావు అధికారంకూడా పనిచెయ్యలేదు. బలవంతాన తండ్రి జేబులోని పర్సు లాక్కుని పది రూపాయలు చేత్తో

పుచ్చుకుని నే నివ్వాళే వెళ్తానని మంకుపట్టు పట్టి ప్రయాణమయింది. ముసలాయన తప్పనిసరిగా స్టేషనుకు వెళ్ళి టికట్టు కొనియిచ్చి వచ్చారు. ఆ రాత్రి వదిన 'నేను చెప్పానా మీ చెల్లెలు కోతి—' అని భర్తను గేలిచేసింది నవ్వుతూ.

5

సాయంత్రం ఎర్రబడ్డది. సరస్వతి ముఖాన కూడా, కారే చెమటలకు అలుముకుపోయిన కుంకుమ రక్తిమను, చూసి కూడా చూడనట్లు తప్పుకు నిల్చున్నాడు శాస్త్రి.

మళ్లీ సజ్జబుట్ట—నుగచెంబు, ప్లాస్కు ట్రంకు పెట్టె ఒక్కటొక్కటే రిక్షావాలా తెచ్చి యింట్లో పడేస్తున్నాడు.

వెలిగిస్తున్న బుడ్డి దీపాన్ని గోడనున్న మేకుకు చేర్చి మసకచీకట్లో 'ఎవరన్నయ్యా—' అంటూ వచ్చింది చెల్లాయి.

క్షణంసేపు మాట్లాడకుండా చూస్తూ నిలబడ్డ మానవాకారం నిశ్శబ్దంగా అక్కడనుంచి నిష్క్రమించింది.

సరస్వతి పోల్చుకో: పోలేదు. వికారిలా పెంచిన గడ్డంతో నల్లటి మురికితుండు నొకదాన్ని చుట్టుకుని స్తంభంవారనుంచి మిడిగుడ్లు పెట్టుకుని చూస్తున్నది ఆ మనిషే—అతగాడేనని.

సరస్వతి చంకనుండి పసికుంక నేలకు జారబోతున్నాడు. చెల్లాయి చప్పున అందుకుంటూ '—నువ్వా వదినా—యిల్లు ఎట్లా పోల్చుకున్నావు?'

సరస్వతి కొంగునున్న ముడివిప్పి మూడు పావలా కాసులు యివ్వబోయింది. రిక్షావాడు తలను పంకిస్తూ 'ఏం దమ్మగోరూ—అయాది కాదని యీయాది, యీ యాదికాదని అది వూరు సంగానికి తిప్పిస్తివే — ముప్పావులా డబ్బులేనా, రూపాయన్నర బేరం. నా నుచ్చుగోనంటె వుచ్చుగోను.'

సరస్వతి నీరసంగా—'అంతే—నాదగ్గర అంతకన్నా లేదు. వెళ్లు వెళ్లు. ఇచ్చిన డబ్బుల్తో తృప్తి లేకపోయాక, అందుకనే మీకు కూడూ గుడ్డా వుండదు.'

ఇచ్చిన ముప్పావులాను గడపమీద వుంచి—'అమ్మగోరూ—నాకాడ తిరకాసు పనికిరాదండీ. మీ డబ్బులు మీరు యిచ్చేస్తేనే సంగోరు దక్కుతుంది.'

అంతసేపూ కావడి బుజాన్నేసుకుని సందుమార్గాన నీళ్ళను తెచ్చి జేరవేస్తున్న శాస్త్రి ఎదురురొమ్ము ముచ్చెమటలు కారుతూండగా కావడిబద్దను పుచ్చుకుని నేలను పొడుచుగుంటూ 'ఎవరి సంగోరురా దక్కంది?' అని పళ్ళు పటపటా పిండి వురిమినట్లు చూశాడు. అంతవరకూ యింట్లో మగవాళ్లు కూడా వున్నారనే జ్ఞానంతో లేని రిక్షావాలా 'ఇసుమంటి బేరాలు నొంకుతగిల్తే నోజుకి నా సామిరంగా! గంజిమెతుకులు కూడా పోవునోపలికి' అని నెమ్మదిగా తోక ముడిచాడు.

'ఇదిగో మంచినీళ్లు వదినా—'

సరస్వతి గుటగుటా రెండు చెంబులెత్తి నోట్లో పోసుగుని—

'అమ్మయ్యా'—అనుకున్నాక—'ఇప్పుడు నీ వంట్లో ఎట్లాగుంది?'

'ఫరవాలేదు. ఇంటికి వెళ్ళమన్నారు. శుక్రవారం శుక్రవారం రిక్షామీద వెళ్లి యింజక్షనులు తీసుగుంటున్నాను.'

చెల్లాయి చంకలోని కుర్రకుంక నెమ్మదిగా బాకాపట్టి యేడుపుకు లంకించుకున్నాడు.

'పాలు కలపాలి కామోసువీడికి—'

'ఆఁ యిందాక రైల్లో యివ్వటమే మళ్లీ పట్టలేదు.'

'ఆ బుట్టలో వున్నాయా పాలడబ్బా—సీసా అవీను...'

'ఆ... నేనిస్తాన్లే. నువ్వెందుకు లేవటం.'

'పాపం యేడుస్తున్నాడొదినా—'

'ఏడవనీ వెధవేడుపు...'

'వేడినీళ్లు కావాలి కాబోలు. కుంపటి అంటించనా.'

'నాకు చెప్పు. నేనే అన్నీ చూసుగుంటాను. నీకు తెలీదమ్మా నీకు కూడా వరసాగ్గా పిల్లలు కలిగితే...యిట్లాటివన్నీ...అప్పుడు అలవాటవుతాయి'

'ఫో...వదినా. సరదాకు పిల్లడికి పాలుపడతానంటే—'

'అదే'—మొదట్లో సరదా ఆ తరువాత బుంద...యిందులోంచి పీక్కుందామన్నా తెరిపి వుండదు. చూడ్డంలే...'

చెల్లాయి లేచి బొగ్గులు కుంపటి చేర్చి నిప్పు వెలిగిస్తూ

'చాలా చిక్కావే వదినా...'

సరస్వతి తనదగ్గర పాలు కలుపుతున్నది నెమ్మదిగా తలెత్తి 'ఏదో నువ్వైనా అడిగావు ఆమాత్రం—అందుకే సంతోషిస్తున్నా.'

చెల్లాయి 'అన్నయ్య వస్తున్నాడు...' అని గొంతు కుంచించి—

'ఈ యిల్లు నీకెట్లా తెలిసింది చెప్పు...యింత మూల డాబాగార్డెను లోంచి చెంగ్లావు పేటకు వచ్చేశామే...'

'నోట్లో నాలికుంటే అన్నీ తెలుస్తాయి... నాకేం సిగ్గు మొహమాటం బిడియం లేవు. ఇదివరకేమన్నా వుంటే ఆ కాస్తా యిప్పుడు హరించుకు పోయాయి. ఎవర్నన్నా అడగ్గలను-ఏవిధంగానన్నా యీ యిల్లుపట్టుకోగల్ను అనుకున్నాను. అంతే-'

'పోనీలే—ఎల్లా వుంది?'

సరస్వతి నాలుగుమూలలా పరిశీలనగా చూసింది. అది మునపటివాటాకన్నా చిన్న—(అద్దె భరించలేక కాబోలు) గూభ్యంలా మూసుకుపోయి నేలబారున వుంది. గాలి వెల్తురూ తక్కువ. ఇహ లోపల, ఎక్కడ సామాను అక్కడే—నానా చిందరగానూ వుంది. గుమ్మం ఎదురుకుండా పెద్ద వేపచెట్టు. నిత్యమూ జోలెడు రోట్టరాల్తుంది. దారివెంట బస్సులు బళ్లూ మనుష్యుల కాలిదుమ్మూ అంతా యీ యింట్లోనే వుంటుంది.

సరస్వతి లేచి దొడ్లోకి వెళ్లింది అక్కడ ఎల్లా వుందో చూడామని. అటువైపు నొక పెద్దబాదం చెట్టు.

అప్పుడే మెరుపు మెరిసినట్లు తన అన్నగారి యింట్లోని సౌకర్యాలు అన్ని హంగులూ, విరుగుడు చావ టీపాయి దగ్గర్నుంచి ఫిలిప్సు రేడియో సెట్టు వరకు జ్ఞాపకం వచ్చాయి.

మరైతే అక్కడే ఎందుకు వుండలేదు? ఇక్కడికి యీ ఎత్తు పల్లాలు గతుకుల్లోకి దేనికి గాను తిరిగి వచ్చింది?

సుఖాన్ని కాని దుఃఖాన్ని కాని కలిగించేది పొందేది మనస్సు. ప్రాపంచికమైన యీ యీవస్తువుల్నుండి వచ్చేవి అనుభూతులే—ఫిలిప్సు రేడియో సెట్టు, వాక్సుహాలు చిన్నకారు, నాలుగంతస్తుల మేడ—మనుష్యులు కోరదగ్గవే—కాని పూరికొంప యింటినిండా దుమ్ము గతుకులు పల్లాలు, ఒకటి వుంటే ఇంకొకటి లేని సంసారం— యిందులోనే గడుపుకుంటూ కూడా మనస్సు దివ్యమైన అనుభూతుల్ని రుచిమాడగలగు. మనుష్యుల్ని వాళ్ళ సంస్కారము మనస్సుయొక్క అంతిస్తుల్ని బట్టి గాని కొలిచేది, బ్యాంకు ప్యాసుబుక్కు బ్యాలెన్సునుంచి కాదు. లోకం అనుకునేట్లు వుత్తమతరగతి జీవితం వున్నత భోగాల్ననుభవించటమే ఐతే—సరస్వతి నిష్కారణంగా నిలుచున్న పాళాన ఎందుకు విశాఖపట్నం ప్రయాణం కట్టింది? ఏదవున్నా యేదిలేకపోయినా నాది అని చెప్పుకునే హక్కుకోసం ఆడ మగా పోరాడ్డాన్ని బట్టిచూస్తే స్వేచ్ఛకోసం స్వాతంత్ర్యం కోసం అన్ని రంగాల్లోనూ పెనుగులాట సాగించటం మనుష్యులకి ఎంత సహజమో చప్పున తెలుస్తుంది.

సరస్వతి ఏమీ వులక్కుండా పలక్కుండా ఆ దొడ్డిగుమ్మాన్నానుకుని అట్లా ఎంతసేపో నిల్చుండిపోయింది.

పిల్లడికి పాలుపడుతూన్న చెల్లాయి అన్నయ్యతో మాట్లాడుతున్నది కాబోలు అని అనుకుని తృప్తిపడసాగింది. గుంటవధవ 'తా... త్త... త్త... త్తా...త్తా' అని చేతుల్ని తిరుస్తూ గచ్చుమీద దీపం వైపుకు వురుకుతున్నాడు హడావిడిగ.

అంతిసేపూ సరస్వతి చూడలేదు గాని బాదం చెట్టు క్రింద రాతిమీద కూర్చుని చిన్నమాసిన కోళ్ళాయి గుడ్డతో శాస్త్రి ఏదో ఆలోచిస్తున్నాడు.

ఆకాశంలో అంతకుముందు గుంపులు గుంపులుగా చేరిన నీలిరంగు మబ్బులమధ్య నుంచి త్రోవను చీల్చుకుంటూ చందమామ పైకి పైకి వస్తున్నాడు. ఆ వెన్నెల ఒక్కసారిగా వచ్చినట్లయింది బాదంచెట్టు కొమ్మలమధ్యనుంచి శాస్త్రిగారిపైన కూడా వెన్నెల పడుతోంది. పగలల్లా ఎండలకు మాడివున్న నేల నెమ్మదిగా చల్లబడ్తోంది. బాదంచెట్టు క్రిందనుంచి

చూస్తే పల్చనిశరీరం—తెల్లటి నీలిరంగు అంచుల చీరలో గుమ్మంవద్ద నిలబడ్డ సరస్వతి చాలా మనోహరంగా అగపడొచ్చు.

హఠాత్తుగా ఆమె దృష్టి శాస్త్రిమీద పడ్డది. తక్షణం చెట్టునీడకు నెమ్మదిగా అడుగులేసుకుంటూ వినీవినిపించకుండా అంది—'ఇక్కడ కూర్చుని వొక్కరూ ఏంచేస్తున్నారు?'

'...........'

'అదంతా నామీద కోపమేనా...'

ఒకటి రెండు బాదవాకులు పుటుక్కున విరిగి నేలకుపడ్డ శబ్దం వినా అతడివద్దనుండి సమాధానం లేదు.

వెనకనే నిల్చున్న సరస్వతి—కఠినంగా, నే నసలు అన్నింటికీ తెగించివచ్చాను. నాదగ్గర మంచితనం లేదు. అనవసనవేమైనా వుంటే నా ముఖాన్నే అనెయ్యండి. అంతేకాని...'

శాస్త్రి మోకాలు క్రిందకుదింపి 'హుఁ' అని మూలిగాడు.

'అన్నట్లు చెల్లాయి వుత్తరం వ్రాసింది. మీరు కోతిని వుంచుకుని దానికి నాపేరు పెట్టారని...'

శాస్త్రి చప్పున అక్కడ్నుంచి లేచి వెళ్లిపోబోయాడు. అతని ఎడమచేతిని చప్పున అందుకుని వెనక్కు లాగుతూ—

'ఆ వ్యవహారమంతా నలుగురినోళ్లోనూ పడింది. మీకేమో మతి చలించిందని... నా కొక్కదానికే తెలుసు. ఈ తంతంతా ఎందుకు జరిపిస్తున్నారో.'

చేతినిగట్టిగావిదల్చి శాస్త్రి లోపలికి దూసుకున్నాడు. చప్పున సరస్వతి బిక్కమొహంపెట్టి రెండుచేతుల్తో ముఖం కప్పుకుని వెక్కి వెక్కి యేడువ నారంభించింది. బాదంచెట్టుమీద కాకి ఒంటికాలుమీద కునుకుతూ హఠాత్తుగా లేచి 'కా... కా' అని అరవటంతో, సరస్వతి యేడుపు మాని గూడుమీదకు ప్రాకబోతున్న గండుపిల్లిని చూసి రాయితీసుకుని వేసింది. అంతే...మళ్లీ యిదివరకు శాస్త్రి కూర్చున్నచోటే కూలబడి మోకాలుమీద ఆన్చిన తలతో ఆలోచిస్తూ యేడుస్తూ కాలక్షేపం చేయసాగింది.

చెల్లాయి కొంతసేపటికి వెతుక్కుంటూ వచ్చి—'ఏమిటిక్కడ...ఎందుకు ఏడుస్తున్నావు వదినా...' అంటూ బుజంమీద చేయివేసి కుదిపింది.

అంతక్రితమే మబ్బుల్లోకి వెళ్లిన చందమామ మళ్లీ యివతలకొచ్చి తొంగితొంగి చూస్తున్నాడు.

'నాకు చెప్పవు వదినా... నే నన్నయ్యను పిలుచుకొస్తానుండు' అని వెళ్ళి నులకమంచం కుక్కిలో వూగుతూ అర్థనిమీలిత నేత్రాలతో గతించిన మర్కట సుందరిని తల్చుగుంటూ పరున్న శాస్త్రి నుద్దేశించి,

'అన్నయ్యా వదిన యేడుస్తోంది?' అంది చేతులు నలుపుకుంటూ.

'ఏ వదిన...' అంటూ అయోమయంగా ప్రశ్నించాడు.

ఈమారు చెల్లాయి కూడా సరస్వతిపక్షం తీసుకోక తప్పిందికాదు.

'వదినంటే—ఆ డాబా యింట్లో ఆవాళ మేడమీద ఎలక్ట్రికుతీగను ముట్టుకుని చనిపోయిన కోతేననా నీ అభిప్రాయం.'

'అంతే... అసలైన వదిన ఎప్పుడో యిక్కడ్నుంచి వెళ్ళిపోయింది.'

'లే అన్నయ్యా. నువ్వు ఒక్కమాటు వచ్చి చెబితే వదిన తప్పకుండా వచ్చి అన్నం తింటుంది.'

శాస్త్రి మూర్ఖంగా 'నావల్ల కాదు...' అనేశాడు.

చెల్లాయి వెంటనే దొడ్లోకి పరుగెత్తి తెగించి ఆడదల్చుకున్న అసత్యం వొదిన ఎదుటను పెట్టింది.

'అన్నయ్య పిలుస్తున్నాడు నిన్ను—'

సరస్వతి ముడుకులమీద ఆన్చిన తల నెత్తి 'నన్నా...'

గుండెలు కొట్టుకుంటుంటే చెల్లాయి 'అవును. నిన్నే...' అని చీకట్లోకి ముఖం త్రిప్పుకుంది.

ఆ అమాయకురాలు యీ మాటలను నమ్మేసి చెంగుతో ముఖం తుడుచుకొని నెమ్మదిగా అను గులో అడుగు వేసుకుంటూ పడకగది చేరింది.

దాన్ని పడకగది అని అనటంకంటే కలకత్తా చీకటికొట్టు అనటం యుక్తమనిపించుగొంటుంది.

గదినిండా డబ్బాలు—నానా చెత్తాను. మధ్యగా నులక కుక్కిలో శాస్త్రి మాగన్నుమీదున్నాడు. సరస్వతి ఒక అడుగు ముందుకువేసి గడ

పను దాటిందో లేదో అవతలివైపు కిటికీదగ్గర వూపిరి బిగ్గబట్టుకుని నిలుచున్న చెల్లాయికి యీ క్రింది మాటలు వినిపించాయి.

సరస్వతి—'పిలిచారట...'

నిశ్శబ్దం.

'మిమ్మల్నే...ఎందుకని అడుగుతున్నాను.'

'నువ్వు నిలువు నిలువంతా అబద్ధాలకోరువి. నీఅంతట నువ్వు వచ్చి నేను పిలిపించానని డబాయిస్తున్నావు.'

'పిలవలేదూ...చెల్లాయి వచ్చి చెప్పింది మీరు పిలిచారని.'

'ఇది వుంకో అబద్ధం—'

'సరే—నేనన్నీ అబద్ధాలే ఆడుతాను. మీరింకా ఎందుకు నన్నిట్లా యేడిపిస్తారు?' శాస్త్రి మాటలు వినిపించలేదు. సరస్వతి గొంతుకే తెమ్పుగున్న వుద్రేకంతో—'కానివ్వండి. మగ మహారాజులు. మీ యిష్టమొచ్చినన్ని ఆటలు మీరు ఆడవచ్చు. ఎల్లా యేడిపించదల్చుకుంటే అల్లా యేడిపించండి.' మళ్ళీ గొంతుకలో వొణుకు...దుఃఖంతో మిళితమైన మాటలు వెంటవెంటనే దొర్లాయి—'నేను మొండిపీనుగను. మీరు వెళ్ళమన్నా వెళ్ళను. ఇదే నా యిల్లు......యిక్కడ్నుంచి నన్ను ఎక్కడికీ ఎవరూ వెళ్ళగొట్టలేరు. మీరు నాతో మాట్లాడక పోయినా నేను యిందులోనే వుంటాను. ఆఖరికి మీ చేతుల్తో ఏ రోజో మీరే యీ నా కాస్త గొంతూ...'

శాస్త్రి వున్నమాటున ఛెళ్ళుమని చెంపపెట్టులా తగిలిన మాటలకు వులిక్కిపడిలేస్తూ—గోడను వ్రేలాడుతున్న దీపంబుడ్డి వత్తి పెద్దదిచేసి చేత్తో పట్టుకుని సరస్వతి ముఖాన ధారలుగట్టి స్రవిస్తూన్న కన్నీటి దొంతరలను వింతగా చూస్తూ—'నీ హృదయం రాయి రా పాషాణమనుకున్నాను. కాని యింత వేలవనుకోలేదు.' అని పకపకా నవ్వాడు. ఒక్కమాటు దించిన తలను కాస్త యెత్తి కోపంగానే అంది—'నేను అలోలక్షణామని యేడుస్తూంటే మీకు హాయిగా కడుపునిండుగా వున్నట్లుందే—'

'అవును.'

'అల్లాగే వుంటుంది లెండి. గుమ్మంలోకి అడుగు పెడ్తే చేసుకున్న దాన్ని కదా ఏమని నోటి నుంచి మాట పెగిలిందా మీకు? ముత్యాలు రాలి పోతా యనుకున్నారు.'

'అంతే—ముత్యాలు రాలి పోతా యనుకున్నాను.'

'పోనీ—కన్న పిల్లవాడినన్నా దగ్గరకు తీశారూ?'

'వాడూ నీ పిల్లాడేగా...'

'అదీ...కోతుల్లో ప్రేమలు వెలిగించే ముఖాలకు అంతకన్నా ఏవిటి తెలుస్తుంది.'

'కోతులే నయమంటాను నేను మనుష్యుల కన్నా. ఒక పొరబాటు చేశాడు భగవంతుడు. అందరికీ తోకలు లేకుండా మనుష్యుల్ని చేసేశాడు కాని, కొంత కొంతమందికి—ఆ స్వభావంకల వాళ్ళను, తేలిగ్గాపోల్చుకునేందుకు వీలయేటట్లు తోకలువుంచితే నే బాగుండిపోయేది?'

'ఏయే స్వభావం కలవాళ్ళకు?'

'అదే—నీకు మల్లే, చీటికీమాటికీ తగూలాడి తెగించి పుట్టిళ్ళకు మా కేమని పోతూంటారే...'

'మాటలు తిన్నగా రానియ్యండి.'

'ఏం—యీమాటు చీపురుకట్ట తిర గేస్తావా?'

'ఆ ముక్క ముందుగా మీ నోటినుంచే వచ్చింది. నేనన్నేదు. మీరు వెళ్ళమంటేనే వెళ్ళాను.'

'మళ్ళీ ఎందుకొచ్చావు? ఏ ముఖం పెట్టుగుని.'

'మీకు ఆ వెళ్ళమనే అధికారం లేదని తెలుసుకున్నాక వచ్చేశాను.'

తరువాత శాస్త్రి నవ్వు వినపడ్డది. మళ్ళీ మాటలు—'నువ్వు యీమారు రెండాకు లెక్కువ చదువుకొచ్చినట్లున్నావు. యిష్టమంటే యిష్టమంటున్నావు.'

'మీరు మాత్రం—కోతుల్లో కాపురం వెలిగించి రాలేదూ—' శాస్త్రికి మిసెస్సు జ్ఞాపకానికొచ్చింది. నెమ్మదిగా అనదల్చుకున్న మాట పైకనేశాడు—'చెల్లాయిని రేపువారం యిక్కడ్నుంచి తోలేస్తాను.'

సరస్వతి 'మీ కాళ్ళు పట్టుగుంటాను—ఆ ముక్క మళ్ళీ అనకండి.' శాస్త్రి నవ్వి 'నీ ధోరణి చూస్తూంటే అంతా కోతిచేష్టలకు మల్లే అనిపిస్తోంది. వెళ్ళేముందు తెచ్చినందుకు తగూలాడావు. ఇప్పుడు పంపిస్తానంటూంటే యిట్నుంచి మళ్ళీ వద్దంటున్నావు. ఏమిటి?' సరస్వతి గోడను జారగిలబడి 'మీరు ఒక్కమాటు గాదు, వెయ్యిమాట్లు గాదు, లక్షసార్లు అనండి. నేను కోతి నే...కోతి నే...... కోతి నే...' అని ఫక్కుమని నవ్వేసింది.

———